RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 203 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 ఆగష్టు 2024 గురువారం పేజీలు : 4

## సెబీ చీఫ్, అదానీపై.. 22న దేశవ్యాప్త ఉద్యమం

న్యూఢిల్లీ : అదానీతో వ్యాపార సంబంధాలు ఉన్నట్లు హిండెన్‌బర్గ్ ఆరోపించిన దరిమిలా.. సెబీ చీఫ్ మాధురి పురీ బుచ్ రాజీనామా చేయాలని.. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఈ నెల 22వ తేదీన దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య ఉద్యమం ధర్నాలు చేపట్టనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జులతో సమావేశ మయ్యారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ సహా 56 మంది నేతలు హాజరయ్యారు. మహారాష్ట్ర, హరియాణా, జారండ్, జమ్మూకశ్మీరు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.




## ఎస్సీ వర్గానికి టీపీసీసీ అధ్యక్ష పదవి దక్కే అవకాశం..?

**టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక.. దాదాపు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఎస్సీ సామజిక వర్గానికి రాష్ట్ర కాంగ్రెస్ సారథ్యం దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ చీఫ్ విప్ పదవి.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని వరించవచ్చని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గ విస్తరణలో ఓసీలకు పెద్దపీట వేస్తారని సమాచారం.**

## ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన?




హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని ట్విటర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓ వైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసిందన్నారు. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా తయారైందని కేటీఆర్ అన్నారు. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయన్నారు. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన అంటే అని కేటీఆర్ నిలదీశారు. నాడు.. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశామన్నారు. నేడు పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మంది మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు చేయిస్తున్నారన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఇంకెప్పుడు ఇస్తారని కేటీఆర్ నిలదీశారు. ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారని ప్రశ్నించారు. 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లని అంచనా అని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏంటని కేటీఆర్ నిలదీశారు. దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో.. పల్లెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. ఇక పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. గ్రేటర్‌తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా అని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ చెప్పుకునే ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదని.. కొత్త పనులకు ప్రణాళిక లేదని విమర్శించారు.




### పంద్రాగస్టు వేడుకలు.. జిల్లాల వారీగా జాతీయ జెండా ఎగురవేసే ప్రముఖులు వీరే..

హైదరాబాద్: తెలంగాణలో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా గోల్కొండ కోటపై సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఇక జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లు జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **జిల్లా కేంద్రాల్లో జాతీయ ఎగురవేసేది వీరే..** 1. ఆదిలాబాద్ – మహ్మద్ అలీ షబ్బీర్, ప్రభుత్వ సలహాదారు 2. భద్రాద్రి కొత్తగూడెం – మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు 3. హనుమకొండ – మంత్రి కొండా సురేఖ 4. జగిత్యాల – ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ 5. జయశంకర్ భూపాలపల్లి – పోదెం వీరయ్య 6. జనగాం – ప్రభుత్వ బీర్ల ఐలయ్య 7. జోగులాంబ గద్వాల్ – ఏపీ జితేందర్ రెడ్డి 8. కామారెడ్డి – పటేల్ రమేశ్ రెడ్డి 9. కరీంనగర్ – మంత్రి శ్రీధర్ బాబు 10. ఖమ్మం – డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 11. కుమ్రం భీం ఆసిఫాబాద్ – మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ 12. మహబూబాబాద్ – ప్రభుత్వ విప్ రామచందర్ నాయక్ 13. మహబూబ్నగర్ – మంత్రి జూపల్లి కృష్ణారావు 14. మంచిర్యాల – హరకర వేణుగోపాల్ 15. మెదక్ – ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు 16. మేడ్చల్ – పట్నం మహేందర్ రెడ్డి 17. ములుగు – మంత్రి సీతక్క 18. నాగర్కర్నూల్ – జి చిన్నారెడ్డి 19. నల్లగొండ – మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 20. నారాయణపేట – గుర్నాథ్ రెడ్డి 21. నిర్మల్ – రాజయ్య సిరిసిల్ల 22. నిజామాబాద్ – అనిల్ ఎరవత్రి 23. పెద్దపల్లి – నేరెళ్ల శారద 24. రాజన్న సిరిసిల్ల – ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 25. రంగారెడ్డి – వేం నరేందర్ రెడ్డి 26. సంగారెడ్డి – మంత్రి దామోదర రాజనర్సింహ 27. సిద్దిపేట – మంత్రి పొన్నం ప్రభాకర్ 28. సూర్యాపేట – మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 29. వికారాబాద్ – స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 30. వనపర్తి – ప్రీతం 31. వరంగల్ – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 32. యాదాద్రి భువనగిరి – మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




## 14లక్షల మందికి ప్రయోజనం
## రెండు లక్షల్లోపు అప్పు మాఫీ..

హైదరాబాద్ : మూడో విడత రుణమాఫీ రేపు ప్రారంభించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మూడో విడత కింద రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణమాఫీని రేపు ఖమ్మం జిల్లా వైరాలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఆ వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. ఈ క్రమంలో అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాదాపు 14.45 లక్షల మందికి రుణమాఫీ అవుతుందని అంచనా. కాగా విదేశాల నుంచి రేవంత్ ఇవాళ హైదరాబాద్‌కు చేరుకుంటారు. రేపు గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌ల వైరాకు పయనమవుతారు. అక్కడ సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభలో రుణమాఫీని ప్రకటిస్తారు.

రుణమాఫీకి అర్హమైన ఖాతాలు మొత్తంగా 32.50 లక్షలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ మేరకు సర్కారు బడ్జెట్‌లో నిధులను కేటాయించింది.




# గోల్కొండ కోట వేదికగా...
# నేడు గుడ్ న్యూస్ చెప్పనున్న సీఎం రేవంత్




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పనున్నట్లు తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుభవార్త చెప్పే అవకాశముంది. రేపు గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేస్తారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులపై రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమయింది. కొన్ని ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం లక్షల సంఖ్యలో ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారందరికీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున అనుకూలమైన వార్తను చెప్పడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. కొన్ని ఏళ్ల నుంచి...తెలంగాణలో ఆరేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త కార్డులను మంజూరు చేయాలని నిర్ణయించింది. అయితే దీనిపై మంత్రి వర్గ ఉప సంఘాన్ని కూడా నియమించింది. ఇటీవల సమావేశమైన మంత్రి వర్గ ఉప సంఘం కొంత మేర దీనిపై చర్చించి కొన్ని నిబంధనలను రూపొందించినట్లు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల వార్షికాదాయం ఉన్న వారికి తెలుపు రంగు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఉప సంఘం సిఫార్సు చేసినట్లు తెలిసింది. అలాగే మాగాణి భూమి మూడు ఎకరాలు, మెట్ట ఏడు ఎకరాలుంటే అర్హులుగా పరిగణించాలని నిర్ణయించారు.రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై...దీంతో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ తెలంగాణలో వేగవంతం చేసేందుకు రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం మంచిదన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది.

నిరుపేదలకు మాత్రమే సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందించాలని నిర్ణయానికి వచ్చింది. అందుకే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన కొన్ని హామీలను రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తికాకపోవడంతో వాటిని అమలు చేయలేదు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ అయితే వాటి ప్రకారం ప్రభుత్వ పథకాలను మంజూరు చేయవచ్చు. మహిళలకు నెలకు 2,500 రూపాయలు, గృహజ్యోతి వంటి పథకాలను అమలు చేసే వీలుంటుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తుంది. దీంతో రేపు గోల్కొండ కోటలో రేవంత్ రెడ్డి ప్రసంగంలో రేషన్ కార్డుల ప్రస్తావన ఉంటుందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

## సంపాదకీయం

### అప్పట్లో దలైలామా.. ఇప్పుడు హసీనా..
### భారత్‌లో ఇంకా ఎన్నాళ్లో?

అది 1959.. టిబెట్ పై చైనా పట్టు బిగుస్తున్నది.. టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు అప్పటికి 24 ఏళ్లు.. దీంతో ఆయన చైనా బారి నుంచి తప్పించుకునేందుకు తన పరివారంతో 1959 మార్చి 30న భారత్ లోకి వచ్చేశారు. ఏప్రిల్ 18న అస్సాంలోని తేజ్‌పూర్ చేరుకున్నారు. ఇక అప్పటుంచి భారత్ ఆయన నివాసం అయిపోయింది. టిబెట్ వాతావరణానికి దగ్గరగ ఉండే హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో శాశ్వత నివాసం ఏర్పరచుకున్నారు. భారత్ నుంచే ఇతర దేశాల పర్యటనలకు వెళున్నారు. ఆయనను తమకు అప్పగించాలని చైనా గట్టిగా కోరుతోంది. కానీ, భారత్ తమ అతిథిని పంపేది లేదంటూ తేల్చిచెబుతోంది.

**చైనాతో యుద్ధం అందుకే..** దలైలామాను అప్పగించనందుకే చైనా 1960ల్లో భారత్ పై యుద్ధానికి దిగింది. అప్పటివరకు హిందీ చీనీ భాయీభాయీ అంటూ ఉన్న వాతావరణం కాస్త ఉద్రిక్తంగా మారింది. చైనాను ఎంతో నమ్మిన భారత తొలి ప్రధాని నెహ్రూ ఆ దేశ నాయకత్వం చేసిన మోసాన్ని తట్టుకోలేక మనో వ్యథకు గురై మరణించారని చెబుతారు. ఇక దలైలామా మాత్రం భారత గడ్డపైన 65 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. ఆయన శిష్య పరంపరకూ భారత దేశమే సొంత గడ్డ అయిపోయింది. బౌద్ధ మత గురువు అయిన దలైలామా ఉమ్మడి ఏపీలో జరిగిన బౌద్ధ సమ్మేళనానికీ హాజరయ్యారు. అతిథిని వెళ్లమనలేని భారత బలహీనతకు చాలా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. భారత్ పై చైనా యుద్ధానికి దిగి అక్సాయ్ చిన్ లోని చాలా ప్రాంతాన్ని ఆక్రమించింది. ఇప్పటికీ అక్కడినుంచి కదలడం లేదు.

**మరి హసీనా సంగతో..?...** భారత్ కు మరో పొరుగు దేశమైన బంగ్లాదేశ్ కు మొన్నటి వరకు ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఆ దేశంలో తనపై పెల్లుబికిన నిరసనలతో ఉన్నపళంగా భారత్ కు వచ్చేశారు. ఇది జరిగింది గత సోమవారం. ఈ మంగళవారంతో 8 రోజులు పూర్తయింది. హసీనా చెల్లెలు రెహానా కూడా ఆమెతోనే ఉన్నారు. ఇక వీరు తొలుత బ్రిటన్ వెళ్లాలనుకున్నా.. తన నిబంధనలు ఒప్పుకోవని ఆ దేశం తేల్చిచెప్పింది. దీంతో భారత్ లోనే ఉంటున్నారు. మధ్యలో త్వరలోనే బంగ్లాకు వెళ్తానని హసీనా చెప్పినట్లు కథనాలు వచ్చాయి. కానీ, మాన్‌స్టర్ వెళ్లిపోయింది అంటూ ఆమెను తీవ్ర పదజాలంతో దూషించారు బంగ్లా కొత్త ప్రభుత్వ సారథి యూనస్. అంటే.. హసీనా బంగ్లాలో కాలుపెడితే అరెస్టు చేసి జైలుపాలు జేయడం ఖాయం అనే పరిస్థితులున్నాయి.

**ఇది రెండోసారి..** హసీనా భారత్ లో ప్రవాసం ఉండడం ఇది రెండోసారి. 1975లో తన తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులను సైన్యం హతమార్చిన సమయంలో హసీనా విదేశాల్లో ఉన్నారు. అప్పట్లో బంగ్లాకు వెళ్లలేక ఆరేళ్లు చెల్లెలు రెహానాతో కలిసి భారత్ లో ఉండిపోయారు. బంగ్లాకు తిరిగివెళ్లాక పదేళ్లు పోరాటం చేసి ప్రజాస్వామ్యం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. 15 ఏళ్లకు పైగా ప్రధానిగా ఉన్నారు. మరి ఇప్పుడు మాత్రం భారత్ నుంచి కదిలే పరిస్థితి లేనట్లుంది.

## ఉత్తమ సేవలందిస్తూ ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలి

### తహశీల్దార్ యాదగిరిరెడ్డి





శామీర్ పేట, (గరుడ వార్త) : అధికారులు ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ప్రజల నుండి గౌరవాన్ని పొందాలని తహశీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. శామీర్ పేట మండల రెవెన్యూ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తాసిల్దార్ ప్రసన్నలక్ష్మి, ఆర్ ఐ లు కుమార్, సుమలతలు బదిలీ అయ్యారు. బదిలీ అయిన అధికారులను తహశీల్దార్ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే శామీర్ పేటకు బదిలీపై వచ్చిన డిప్యూటీ తహశీల్దార్ గా విచ్చేసిన సంయుక్తాను, ఆర్ఐ లు కవిత, రాఘవులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ అధికారులు ఎక్కడ విధులు నిర్వహించిన ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కాగా డిప్యూటీ తహశీల్దార్ ప్రసన్నలక్ష్మి కూకట్ పల్లి మండల రెవెన్యూ కార్యాలయానికి బదిలీ కాగా, మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సంయుక్త శామీర్ పేట రెవెన్యూ కార్యాలయానికి డిప్యూటీ తహశీల్దార్గా బదిలీపై వచ్చారు. అలాగే ఆర్ ఐ కుమార్ శామీర్ పేట నుంచి మేడ్చల్ రెవెన్యూ కార్యాలయానికి, ఆర్ ఐ సుమలత మేడ్చల్ కలెక్టరేట్కు బదిలీ కాగా మేడ్చల్ రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కవిత శామీర్ పేట రెవెన్యూ కార్యాలయానికి, మూడు చింతలపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాఘవులు శా మీర్ పేట రెవెన్యూ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతి పరుగుకు ప్రక్షాళన

హైదరాబాద్ : రాజధాని పాలనను గాడిన పెట్టడానికి ప్రభుత్వం ప్రక్షాళన మొదలుపెట్టింది. ఇందులో భాగంగా కీలకమైన జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలికి సారథులుగా కొత్త అధికారులను నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ విద్యుత్తుశాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ ఆమ్రపాలిని, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్, జలమండలి ఎండీగా అశోక్‌రెడ్డిని నియమించారు. బల్దియా విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌కు బాధ్యతలు అప్పగించారు. బల్దియాకు కొత్తగా జోనల్ కమిషనర్లూ వచ్చారు.

జోనల్ వ్యవస్థపై దృష్టి..

జీహెచ్ఎంసీలో ఆరు జోన్లు ఉండగా, నాలుగు జోన్లకు కొత్త జోనల్ కమిషనర్లు నియమితులయ్యారు. అభిలాష అభినవ్ బదిలీతో ఖాళీ అయిన కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ స్థానంలో అపూర్వ్ చౌహాన్‌ను, హేమంత్ స్థానంలో ఖైరతాబాద్ జోనల్ కుర్చీని అనురాగ్ జయంతితో సర్కారు భర్తీ చేసింది. ప్రస్తుత ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్.పంకజను కేంద్ర కార్యాలయానికి పంపిస్తూ.. ఆమె స్థానంలో హేమంత్ పాటిల్‌ను, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌ను అదనపు కమిషనర్‌కు పరిమితం చేసి, ఆమె స్థానంలో ఉపేందర్‌రెడ్డిని జెడ్సీలుగా ప్రభుత్వం నియమించింది.

మెప్పించిన రోనాల్డ్‌రాస్..

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా జులై 5, 2023న బాధ్యత తీసుకున్న రోనాల్డ్‌రాస్.. మొదటి రోజు నుంచే పాలనలో వేగం పెంచారు. ఆస్తిపన్ను విభాగాన్ని ప్రక్షాళన చేశారు. పన్ను చెల్లింపులో జరుగుతున్న అవకతవకల కట్టడికి నగదు రహిత విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆర్థిక విభాగాన్ని పూర్తిగా డిజిటలీకరణ చేశారు. పైవంతెనల నిర్మాణ పనులను కొనసాగించడంపై దృష్టిపెట్టారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ఓటరు జాబితాను ప్రక్షాళన చేసి, పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగేందుకు దోహదపడ్డారు.

బల్దియాకు కొత్త రక్తం!బల్దియాలో ఒకవైపు అభివృద్ధి పనులకు ఖజానాలో చిల్లిగవ్వ లేకపోవడంతో కాలనీల్లో రోడ్లతోపాటు ఇతరత్రా దాదాపు రూ.1500 కోట్ల విలువైన పనులు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న ఎస్ఆర్‌డీపీ, నాలాల విస్తరణ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే దాదాపు రూ.6 వేల కోట్లు అవసరం. బల్దియాలో ఆర్థిక సంక్షోభం నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు పూర్తవడంతో మహానగరం విస్తరణ, అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొత్త కమిషనర్‌ను నియమించి వేగంగా పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆమ్రపాలిని కమిషనర్‌గా నియమించారు. నగరానికి మొట్టమొదటి మహిళా కమిషనర్ ఈమే కావడం గమనార్హం.

అభివృద్ధి కార్యక్రమాలకు సిద్ధమవుతున్న హెచ్ఎండీఏ!

హెచ్ఎండీఏ కమిషనర్‌గా చిరంజీవులును బదిలీ చేసిన తరువాత పూర్తిస్థాయి కమిషనర్‌ను ప్రభుత్వం నియమించలేదు. రెండేళ్లకు పైగా ఆనాటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ కమిషనర్‌గా కూడా ఉండేవారు. తరువాత పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్‌ను హెచ్ఎండీఏ కమిషనర్ బాధ్యతలను అప్పగించింది. ఈ విభాగం ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టులను చేపట్టాలన్న ఉద్దేశంతో సర్ఫరాజ్ అహ్మద్‌ను కమిషనర్‌గా సర్కార్ నియమించింది. భవిష్యత్తులో కొన్ని హెచ్ఎండీఏ భూములను కూడా విక్రయించేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు రైతుల నుంచి భూ సమీకరణ చేసి లేఅవుట్లు వేసే ప్రాజెక్టును పెద్దఎత్తున మొదలపెట్టాలని నిర్ణయించారు. మరికొన్ని విస్తరణ ప్రాజెక్టులను చేపట్టడానికి కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది. కీలక ప్రాజెక్టులకు ప్రణాళికలు

గత ఆరేళ్లుగా జలమండలి ఎండీగా ఐఏఎస్ అధికారి దానకిషోర్ మెప్పించారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో తాగునీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకున్నారు. నగరం చుట్టుపక్కల గ్రామాలకు కొత్త ప్రాజెక్టును అమలు చేశారు. ఇటీవల దానకిషోర్‌ను కీలకమైన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించిన సర్కార్ సుదర్శన్‌రెడ్డిని నియమించింది. ఆయన వేగంగా నిర్ణయాలు తీసుకోకపోవడంతో వేసవిలో నగరంలో అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఎదుర్కొంది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతో దానకిషోర్ రంగంలోకి దిగి సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనలతో పరిస్థితిని చక్కదిద్దారు. ఈ నేపథ్యంలో సుదర్శన్ రెడ్డిని బదిలీ చేసి అశోక్‌రెడ్డిని ఎండీగా ప్రభుత్వం నియమించింది. కీలకమైన ప్రాజెక్టులను మొదలు పెట్టడానికి సర్కార్ ప్రణాళికను రూపొందిస్తోంది.

## 105% పెరిగిన హైదరాబాద్ మెట్రో ఆదాయం

హైదరాబాద్: మెట్రోని నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ఆదాయం గత ఆర్థిక సంవత్సరంలో అమాంతం పెరిగింది. ఏకంగా 105 శాతం పెరిగినట్లు ఆర్థిక నివేదికలో వెల్లడించింది. 2022–23లో రూ.703.20 కోట్ల ఆదాయం రాగా.. 2023–24లో రూ.1407.81 కోట్లకు పెరిగినట్లు నివేదికలో పేర్కొంది. ఫలితంగా నష్టాలు గతేడాది భారీగా తగ్గాయి. 2022–23లో రూ.1315.99 కోట్ల నష్టాన్ని చూపించిన ఆ సంస్థ... గతేడాది రూ.555.04 కోట్లకు తగ్గినట్లు నివేదికలో వెల్లడించింది. మెట్రో ప్రారంభం నుంచి ఇప్పటివరకు నష్టాలు రూ.5979.36 కోట్లకు చేరాయని పేర్కొంది.

గత ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల టిక్కెట్ల ద్వారా రూ.611.48 కోట్ల ఆదాయం వచ్చింది.

టీవోడీ ద్వారా రూ.796.33 కోట్లు వచ్చినట్లు నివేదికలో చూపారు. ఇందులో అద్దెల ద్వారా రూ.110.42 కోట్లు, ప్రకటనల ద్వారా రూ.81.06 కోట్లు, ఇతరత్రా రూ.82.77 కోట్లు వచ్చాయి. ఎల్ అండ్ టీ మెట్రోకి ప్రభుత్వం లీజుపై ఇచ్చిన రాయదుర్గంలోని భూమిని స్లంప్‌సేల్ రూపంలో రహేజా గ్రూప్, బ్రూక్‌ఫీల్డ్ కార్పొరేషన్‌కు బదిలీ చేయడం ద్వారా మొదటి విడతగా రూ.511.73 కోట్లు అందింది. దీంతో ఆదాయం పెరిగినట్లయింది.

రూ.5979.36 కోట్లకు చేరిన నష్టాలు

మెట్రోరైళ్లు నగరంలో ఆరేళ్లుగా నడుస్తున్నాయి. కొవిడ్ సమయంలో మెట్రో భారీగా నష్టాలను మూటకట్టుకుంది. 2022 మార్చి 31 నాటికి నష్టాలు రూ.4108.37 కోట్లు ఉండగా.. 2023 మార్చి 31 నాటికి రూ.5424.37 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి నష్టాలు రూ.5979.36 కోట్లకు చేరినట్లుగా ఆర్థిక నివేదికలో ఎల్ అండ్ టీ మెట్రో వెల్లడించింది.

తగ్గని ఆదరణ

ఎండల ప్రభావం ఒక్కటేకాదు..సమయం కలిసి వస్తుందనుకునే వారి సంఖ్య పెరగడంతో మెట్రోకు ఆదరణ తగ్గడం లేదు. సోమవారం ఉదయం రోజువారీ కంటే ముందే సేవలు ప్రారంభిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు సేవలను పొడిగించారు. గడిచిన రెండు నెలల్లో ప్రయాణికుల గణాంకాలను పరిశీలిస్తే... ఏప్రిల్‌లో 1,23,95,205 మంది మెట్రోలో వెళ్లారు. రోజువారీగా సగటున 4.13 లక్షల మంది ప్రయాణించారు. మే నెలలో 1,31,05,805 మంది రాకపోకలు సాగించారు. రోజువారీ సగటు 4.22 లక్షలుగా ఉంది.

రద్దీకి తగినట్టు లేక...: ప్రయాణికుల సంఖ్య 6 లక్షల మందికి పెరగాల్సి ఉందని మెట్రో వర్గాలు అంటుంటే...ఉదయం, సాయంత్రం కార్యాలయాల వేళల్లో విపరీతంగా రద్దీ ఉంటోందని దానికి సరిపడా మెట్రోలు లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

మరి ఖర్చుల మాటేమిటి?

మెట్రోరైలు ఆపరేషన్స్‌కు రూ.400.06 కోట్లు, ఉద్యోగుల వేతన ప్రయోజనాలు రూ.35.85 కోట్లు, పరిపాలన, ఇతర ఖర్చులు రూ.36.03 కోట్లు అయ్యింది.

మెట్రో నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులపై చెల్లించిన వడ్డీ గతేడాది రూ.1173.11 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే వడ్డీ భారం స్వల్పంగా తగ్గింది. 2022–23లో వార్షిక వడ్డీ భారమే రూ.1273.36 కోట్లుగా ఉంది.

రూ.309.30 కోట్లను ఆస్తుల తరుగుదల చూపారు.

మొత్తంగా వ్యయం రూ.1962.85 కోట్లుగా చూపారు. ఆదాయం 1407.81 పోగా.. రూ.555.04 కోట్ల నష్టాలను 2023–24 ఆర్థిక సంవత్సరంలో చూపారు.

మెట్రో మార్గాలు : 3
రోజు నడిచే రైళ్లు : 57
మెట్రో మార్గం(కి.మీ.) : 69.2 ప్రతిరోజు మెట్రో ట్రిప్పులు : 1000నిత్యం తిరిగే దూరం(కి.మీ.) : 25000సగటున ఒక్కో ప్రయాణికుడు ప్రయాణిస్తున్న దూరం(కి.మీ.) : 12.5

## ఇష్టారీతిన వేబిల్లులు..
## దూసుకెళ్తున్న ట్రాక్టర్లు

సిరిసిల్ల : వేములవాడ మూలవాగు నుంచి వేబిల్లుపై ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. గనులశాఖ ఏడీ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో రెండో బైపాస్‌లో ఇసుక ట్రాక్టర్ల వేబిల్లులను తనిఖీ చేస్తుండగా, ఈ క్రమంలో రహదారిపై భారీగా ట్రాక్టర్లు నిలిచిపోయాయి. అదనపు ట్రిప్పులకు సమయం ఉండదని భావించిన మరో ట్రాక్టర్ డ్రైవర్ ఇవేమీ పట్టించుకోకుండా దూసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఏడీ ట్రాక్టర్‌ను నిలపాలని డ్రైవర్‌కు సూచించినా వినిపించుకోలేదు. తనిఖీలకు సహకరించకపోగా డ్రైవర్లంతా అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ పరిణామంతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కలుగజేసుకుని ట్రాక్టర్లను పక్కకు తప్పించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చేశారు. ఈ తనిఖీల్లో వేబిల్లుల జారీలో లోపాలను గనులశాఖ అధికారులు గుర్తించారు.

జిల్లాలో స్థానిక అవసరాలకు వేబిల్లుల ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతులున్నాయి. వీటిని అడ్డంపెట్టుకుని అక్రమార్కులు వాగుల్లోని ఇసుకంతా లూటీ చేస్తున్నారు. మానేరు, మూలవాగుల్లోని ఇసుక రీచ్‌ల నుంచి తీసుకెళ్లడానికి రెవెన్యూ అధికారులు మండలానికి ఒకటి, రెండ్రోజులు వేబిల్లులు జారీ చేస్తారు. ఆ రోజు ట్రాక్టర్ల వేగానికి అడ్డూ అదుపు ఉండదు. ఇవి తిరిగినంత సేపు రహదారిపైకి రావాలంటేనే స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇసుక తరలించే ట్రాక్టర్లకు నంబర్లు ఉండవు. నడిపే వారిలో చాలా మందికి లైసెన్సులు ఉండవు. కొన్ని చోట్ల మైనర్లు సైతం నడుపుతున్నారనే ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వ శాఖల సమన్వయలేమి కారణంగా రహదారులపై డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వరుస సంఘటనలే దీనికి నిదర్శనం. జిల్లాలో మానేరు, మూలవాగులో పన్నెండు ఇసుక రీచ్‌లున్నాయి. వీటిలోనే మండలాల వారీగా వారంలో రెండ్రోజులు రెవెన్యూశాఖ



వేబిల్లులు జారీ చేస్తుంది. ఒక వేబిల్లుకు రూ.300 చెల్లిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు జారీ చేస్తారు. వీటిని తీసుకున్న ట్రాక్టర్ యజమానులు గంటలోపు వినియోగించుకోవాలి. రీచ్‌లో ట్రాక్టర్ నంబరు, ఇసుక నింపే సమయం కచ్చితంగా నమోదు చేయాలి. కానీ ప్రతి రీచ్‌లోనూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లెక్కకు మించి ట్రిప్పులతో ఇసుకను తరలిస్తుంటారు. వేగంగా ఎన్ని ఎక్కువ ట్రిప్పుల్లో ఇసుకను తరలిస్తే అంత రాబడి అన్నట్లుగా డ్రైవర్లు వ్యవహరిస్తుంటారు. మైనర్లు, లైసెన్సులు లేనివారు, మద్యం తాగి వాహనాలను అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక రీచ్‌లు గుర్తించే వరకే మైనింగ్ శాఖ అధికారుల బాధ్యత. రెవెన్యూది వేబిల్లులు జారీచేసే వరకే అంటూ పట్టనట్లు ఉంటున్నారు. ఇక ప్రమాదాలు జరిగితే తప్ప పోలీసులు రావడం లేదు.

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ మానేరువాగులోని ఇసుక రీచ్ నుంచి బుధ, శుక్రవారాలు ఎల్లారెడ్డిపేట మండలానికి, మంగళ, శనివారాలు గంభీరావుపేట మండలానికి వేబిల్లులు జారీ చేస్తున్నారు. వారంలో నాలుగు రోజులు ప్రధాన రహదారిపై ఇసుక వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తుండటంతో స్థానికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరవయ్యారు. శనివారం ఎల్లారెడ్డిపేటలో పలు కాలనీవాసులు ట్రాక్టర్లను అడ్డగించి రహదారిపై బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకుని నెమ్మదిగా వెళ్లేలా చూస్తామని నచ్చజెప్పడంతో శాంతించారు.

అధికారులేమంటున్నారంటే...ఇసుక తరలింపు సమయంలో రెవెన్యూ, గనులశాఖ తనిఖీలకు డ్రైవర్లు సహకరించాలని గనులశాఖ ఏడీ క్రాంతి కుమార్ తెలిపారు. మా శాఖ తరఫున తనిఖీలు చేసిన సమయంలో నంబర్లు లేని వాహనాలను గుర్తించాం. వేబిల్లులపై సమయం, తేదీ రాయడం లేదు. వేబిల్లు జారీ సమయంలోనే రెవెన్యూశాఖ ఇవన్నీ సరిచూసుకోవాలి. ట్రాక్టర్ల తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేకుండా నడిపిన వాటికి ఫెనాల్టీ వేస్తున్నామని ఎంవీఐ రజినీదేవి పేర్కొన్నారు.

## తూకంలో వ్యత్యాసం..
## రేషన్ డీలర్ల ఆందోళన

కోరుట్ల : రేషన్ బియ్యం తూకంలో వ్యత్యాసం వస్తోందంటూ జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మార్క్‌ఫెడ్‌లోని మండల స్థాయి నిల్వల కేంద్రంలో ఆందోళన చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టాక్ పాయింట్‌లో బియ్యం తూకం వేస్తే ఒక రేషన్ బియ్యం బస్తా 50 కిలోలు ఉంటే దానికి ఉన్న గన్ని సంచి బరువు 0.58



గ్రాములు కలుపుకొని 50.58 కిలోలు చూపించాల్సి ఉండగా 51.200 కిలోలు చూపిస్తోందన్నారు. ఇలా ఒక్కో డీలర్‌కు 250కిపైగా బియ్యం బస్తాలు తూకం వేస్తే పెద్దమొత్తంలో నష్టం వస్తుందన్నారు. స్టాక్ పాయింట్‌లో వేస్తున్న తూకంపై అనుమానం తలెత్తుతోందని, అక్కడ వేసిన తూకాన్ని తిరిగి ప్రైవేట్‌లోనూ వేయాలని కోరారు. లోడింగ్‌లో చిరిగిపోయిన బియ్యం బస్తాలు కూడా పంపిస్తున్నారన్నారు. ప్రభుత్వం 50 కిలోలు అని అధికారికంగా ముద్రించిన సదరు బ్యాగులను 51 కిలోలుగా లెక్కించి రసీదులు జారీ చేస్తున్నారని, దీనిపై అడిగితే వానాకాలంలో తూకం బరువు పెరుగుతుందని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గాలి గట్టయ్య, డి.శ్రీనివాస్ రావు, ఎస్కే హైదర్, విజయ్, సరోజన, రజిత, సమత, లచ్చన్న, తదితరులు ఉన్నారు.

# కిసాన్ కార్డు రుణాల వడ్డీ రాయితీ

జగిత్యాల : కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులు(కేసీసీ) తీసుకున్న రైతులకు 2024-25 సంవత్సరానికి కూడా వడ్డీరాయితీ కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. రుణాలతో పాటు పశుసంవర్ధక, పాడి, మత్స్య తదితర రంగాల్లోని వారికి రూ.3 లక్షల్లోపు స్వల్పకాలిక రుణాలను తీసుకుని గడువులోగా చెల్లిస్తే 3 శాతం వడ్డీరాయితీ వర్తిస్తుంది.

**జారీలో వెనుకంజ**

జిల్లాలో రైతులు, పాడి, చేపల పెంపకందారులు 2.45 లక్షల మంది వరకుంటే కేవలం 18 వేలలోపు కార్డులను జారీచేయటం కేసీసీ వెనుకంజను వెల్లడిస్తోంది. అయితే వీరు రుణం తీసుకున్నపుడు బ్యాంకుల్లో కేసీసీ పత్రాలపై సంతకాలను చేసి తీసుకుంటున్నారు తప్పితే కార్డులను జారీ చేయటంలేదు.

బ్యాంకులో పంటరుణం తీసుకున్నపుడు మంజూరుచేసిన మొత్తాన్ని రైతు సేవింగ్ ఖాతాకు జమచేస్తారు. ఇలా సేవింగ్ ఖాతాకు జమచేసిన మరుక్షణం నుంచి తిరిగి చెల్లించే వరకు వడ్డీ లెక్కిస్తారు. కానీ కిసాన్ క్రెడిట్ కార్డును తీసుకున్నపుడు ఈ ఖాతాలోనే పంటరుణం మొత్తం జమగా ఉంటుంది. రైతు కార్డు ద్వారా ఎంత మొత్తాన్ని తీసుకుంటే అంతే మొత్తానికి వడ్డీ పడుతుంది. ఒకేసారి కాకుండా దఫాలుగా తీసుకునేవారికి వడ్డీ తగ్గుతుంది. 19-69 సంవత్సరాల వయసున్నవారు తగిన పత్రాలతో కార్డులను తీసుకోవచ్చు. ఇదివరకు ఏటీఎం కార్డుఉంటే సదరు కార్డును కిసాన్ క్రెడిట్‌కార్డు ఖాతాకు లింక్ చేయించుకుంటే సాధారణ ఏటీఎంగా, కిసాన్ క్రెడిట్ కార్డుగానూ వినియోగించుకోవచ్చు. ఏటీఎంల నుంచి లేదా ఇతరత్రా కార్డుద్వారా లావాదేవీలు జరిపినపుడు రెండు ఖాతాలు కనిపిస్తాయి. ఏ ఖాతానుంచి డబ్బులను



వాడాలనుకుంటే ఆ ఖాతాను క్లిక్ చేసినపుడు అందులోనుంచి డబ్బులు వినియోగమవుతాయి.

జిల్లాలోని 89 వేల పీఎం కిసాన్ సమ్మాన్ పథకం లబ్ధిదారులకు కార్డులు ఇవ్వాల్సి ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డులతో సంవత్సరం పొడవునా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేయవచ్చు. పీవోఎస్ యంత్రాల ద్వారా పంట ఉత్పాదకాలకు కొన్నపుడు రాయితీలు వర్తిస్తాయి. క్రెడిట్ కార్డు ద్వారా అదనంగా కేంద్రంనుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాన్ని పొందవచ్చు. పావలావడ్డీ వర్తింపు, సురక్ష బీమా యోజన కూడా అమలు చేస్తారు.

**అందని పావలా వడ్డీ**

కేసీసీ ద్వారా తీసుకున్న రుణాలకు 7 శాతం వడ్డీ ఉంటుంది. ఇందులో రూ.లక్షలోపు పంటరుణాలకు 3 శాతం రాయితీని కేంద్రం ఇస్తే 4 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. అంటే రూ.లక్షలోపు పంటరుణాలకు సున్నావడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల్లోపు పంటరుణాలకు పావలా వడ్డీ ఉంటుంది. కానీ గతకొన్ని సంవత్సరాలుగా కేంద్రం రాయితీని సక్రమంగా ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 4 శాతం రాయితీని ఇవ్వక బ్యాంకర్లు రైతుల నుంచే వడ్డీని వసూలు చేస్తున్నాయి.

# పల్లెల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

సుల్తానాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాల నిర్వహణతో మద్యం ఏరులై పారుతోంది. గుడుంబా అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఇదంతా 'మామూలు'గానే కనిపిస్తోంది. లైసెన్సుడ్ దుకాణాల నిర్వాహకులు విక్రయాలను పెంచుకునేందుకు గొలుసుకట్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. దాదాపు 60 శాతం మద్యం వీటి ద్వారానే అమ్ముడుపోతోంది. దేవునిపల్లి, రేగడిమద్దికుంట, గట్టెపల్లి, సుల్తానాబాద్, కాట్నపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లో



విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో నిత్యం గొడవలు జరుగుతున్నాయి.

**అదనపు వసూళ్లు**

మండలంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి గొలుసు దుకాణాలకు అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. సుల్తానాబాద్ పురపాలక సంఘం, గ్రామాల్లో కలిపి దాదాపు 300 గొలుసు దుకాణాలుండగా ప్రతి చోటా 50 క్వార్టర్లు, 10 బీర్లు విక్రయిస్తున్నారు. ఒక్కో సీసాపై వ్యాపారులు రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. వీటికి గొలుసు దుకాణంలో అదనంగా రూ.20 చొప్పున జత చేసి విక్రయిస్తున్నారు. దీంతో మద్యం బాబులపై మొత్తం రూ.30 వరకు అదనపు భారం పడుతోంది.

గ్రామాల్లో కిరానా దుకాణాలు, టీకొట్లు, టేలాలే మద్యం విక్రయాలకు అడ్డాగా మారాయి. దీంతో దుకాణాల వద్దకు మహిళలు, విద్యార్థినులు వెళ్లడానికే జంకుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

మండలంలోని మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మా దృష్టికి రాలేదు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. గురునాథ్‌రాథోడ్, సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ

# మీ ఆరోగ్యం... మీ చేతుల్లోనే..!



వికారాబాద్ : అన్నీ తెలిసీ.. సరైన సమయానికి తినక.. ఏదో ఒకటి.. ఎప్పుడో ఒకప్పుడు.. ఎలానో ఒకలా తినేసి చేతులారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నావురా.. అని పెద్దలు అంటుంటారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉండాలంటే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు..

మహానగరంలో విద్యా, ఉపాధి ఇతర అవసరాలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది వస్తుంటారు. కొందరూ ఇక్కడే స్థిరపడిపోయారు. వీరిలో యువతీయువకులు ఎక్కువగా ఉంటారు. ఉద్యోగాలు, విద్యాసంస్థలకు వెళ్లి తిరిగి ఇళ్లకు చేరుకుంటారు. వంట చేసుకునే సమయం, ఓపిక లేక కర్రీపాయింట్లను ఆశ్రయిస్తుంటారు. చిన్న పెట్టుబడితో ఎక్కువ మంది వీటిని ఏర్పాటు చేస్తుంటారు. కర్రీపాయింట్లకు గిరాకీ పెరగడంతో రుచి, శుభ్రత ఎలా ఉన్నా వాటిపై బ్యాచిలర్లు, భార్యాభర్తలు ఉద్యోగస్తుయితే వంట చేసుకునే తీరిక లేక ఆధారపడుతారు.

కొన్నిచోట్ల ఇలా: కొన్ని హోటళ్లలో నాణ్యతలేని పదార్థాలు, బూజుపట్టిన కూరగాయలే కనిపిస్తున్నాయి. రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి మళ్లీ వేడిచేసి వాటిని ఆహారంలో వినియోగిస్తున్నారని జీహెచ్ఎంసీ, ఆహార భద్రతా అధికారుల దాడుల్లో బయట పడుతోంది. రుచి కోసం వేసే కారం, నూనెలు, మసాలాల్లో చాలావరకు గడువు తీరినవే ఉంటున్నాయి

**ఇలా తింటే ..ఇబ్బందులే**

కర్రీపాయింట్లలో రుచికోసం అధిక మసాలాలు, నూనెలు, కారం వాడేస్తున్నారు. మాంసపు కూరల్లో వీటి వినియోగం మరీ ఎక్కువగా ఉంటోంది. తరచూ ఇలాంటి పదార్థాలను తినడంతో జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దీర్ఘకాలిక ఉదరకోశ, పేగుక్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలోకి అధిక కేలరీలు, చెడు కొలస్ట్రాల్ చేరుతుంది.

డయాబెటిక్, బీపీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడేవారికి సమస్యలు మరింత ఎక్కువ కావొచ్చు.

వండిన మాంసాహారాన్ని రోజుల తరబడి నిల్వ చేయడంతో సాల్మోనెల్లా అనే ప్రమాదకర బ్యాక్టీరీయా వృద్ధి చెంది ఇతర వ్యాధులకు కారణమవుతుంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

కర్రీ పాయింట్లను శుభ్రమైన పరిసరాల్లో నిర్వహించాలి.

వంటశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి.

వంటలు చేసేవారు, వాటిని విక్రయించేవారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. చేతికి గ్లౌజులు, తలకు టోపీ తప్పక ధరించాలి.

చేతిగోళ్లలో మురికి లేకుండా చూడాలి.

వండిన వంటలపై మూతలు ఉండాలి.

వేడిగా ఉన్నా ఆహార పదార్థాలను విక్రయించాలి.

ఇంటి ఆహారంతోనే ఆరోగ్యం...- ఆంజనేయులు, ఉపకమిషర్, ఉప్పల్

ఈ మనం తీసుకునే ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కర్రీ పాయింట్ల యజమానులు తక్కువ ధరకు వస్తున్నాయని నాణ్యత లేని పదార్థాలతో తయారు చేస్తున్నారు. వీలైనంతవరకు బయటి పదార్థాలను తినకపోవడం మేలు.

# భవనం పూర్తి చేసి.. చిన్న చిన్న పనులు ఆపేసి



ముస్తాబాద్: ఆధునిక హంగులతో విశాలమైన తరగతి గదులను నిర్మించారు. భవన సముదాయానికి సంబంధించి పనులు పూర్తయ్యాయి. ఇది జరిగి దాదాపు ఏడాది అవుతుంది. చిన్న చిన్న పనులు చేయాల్సి ఉందని చెప్పి గుత్తేదారు పాఠశాలకు అప్పగించలేదు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముస్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 125 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరి కోసం దాదాపు రూ. 4 కోట్లు వెచ్చించి ఆధునిక హంగులతో నూతన భవన సముదాయాన్ని నిర్మించారు. ఇది జరిగి దాదాపు ఏడాది అవుతుంది. గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు పైన రెండు అంతస్తుల్లో 16 తరగతి గదులు నిర్మించారు. పక్కనే 500 మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేసే విధంగా డైనింగ్ హాల్, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, మూత్రశాలలు నిర్మించారు. తరగతి గదుల్లో ఫర్నిచర్ ఏర్పాటు చేసి ఫ్యాన్‌లు బిగించారు. డైనింగ్ హాల్‌లో మాత్రం ఇంకా టేబుళ్లు, బెంచీలు వేయలేదు. ల్యాబ్‌లో మెటీరియల్, కంప్యూటర్‌లు ఏర్పాటు చేయలేదు. థాలయానికి సంబంధించిన టేబుళ్లు కొనుగోలు చేయాల్సి ఉంది. పాఠశాల ముందు భాగంలో గ్రీన్‌మ్యాట్ వేయాల్సి ఉంది. నైట్ వాచ్‌మెన్ లేకపోవడం వల్ల భద్రత ఉండదని చెప్పి గుత్తేదారు గ్రీన్‌మ్యాట్ వేయడానికి వెనుకంజ వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాల్వ వ్యవస్థ సరిగా లేక మురుగు ఆవరణలోనే పారుతూ విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. మైదానం గుంతలమయంగా మారింది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి విద్యార్థుల రాకపోకలకు అసౌకర్యంగా మారుతుంది. ప్రారంభించక ముందే కిటికీల అద్దాలు పగిలిపోయాయి. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది కావస్తున్నా ఇంతవరకు అసంపూర్తి పనులు పూర్తి చేయలేదు. దీంతో భవన సముదాయాన్ని అధికారికంగా ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి మిగిలిన పనులు పూర్తి చేయించి భవన సముదాయాన్ని పాఠశాలకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

**విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి**

పాఠశాల భవన సముదాయం పూర్తయింది. మైదానం గుంతలమయంగా ఉంది. మురుగు కాల్వ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. అందుకోసమని అధికారికంగా ప్రారంభించలేదు. అధికారుల విన్నపం మేరకు సదరు గుత్తేదారు తరగతులు నిర్వహించేందుకు అనుమతిచ్చారు. పనులు పూర్తి చేసి అప్పగిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తాం. రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

# విరిసిన చైతన్యం.. కొనసాగిస్తేనే ఆరోగ్యం

పెద్దపల్లి : ఈ నెల 5 నుంచి అయిదు రోజుల పాటు నిర్వహించిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు.. ఇలా వివిధ రంగాల భాగస్వామ్యంతో ఆశించిన ఫలితం కనిపించింది. ప్రతి ఒక్కరూ ఉద్యమ తరహాలో ముందుకొచ్చి శ్రమదానం చేశారు. పల్లెల్లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగింది. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. నిర్దేశిత ప్రగతి లక్ష్యాలు చేరుకున్నాయి. ఇప్పటి నుంచి శుభ్రతపై దృష్టి సారించి, చెత్త లేకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అంతంతే**

జిల్లాలో రహదారులు, మురుగుకాలువల్లో నిర్దేశించిన చోట్ల పూడిక తొలగించారు. 1,174 ప్రభుత్వ సముదాయాల్లో శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1,194 చోట్ల కార్యక్రమాలు చేపట్టారు. శిథిలావస్థలోని 38 ఇళ్లను తొలగించారు. డ్రై డే రోజున 14,595 గృహాల్లో వృథా నీటిని పారబోశారు. వన మహోత్సవంలో భాగంగా 2,47,334.4 మీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్‌కు ప్రతిపాదించగా 1,15,591 మీటర్లలో మొక్కలు నాటారు. అయితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉంది. జిల్లాలో వీరు 15 సార్లు పాల్గొన్నారు. అధికారులు మాత్రం 160 సార్లు పల్లెలను సందర్శించారు.



**ఫలితమిచ్చిన పర్యవేక్షణ**

జిల్లాలోని 266 పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాల్లో అయిదు రోజుల పాటు జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.

గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించడంతో సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల సందర్శనలతో కింద స్థాయి సిబ్బంది రోజువారీగా నిర్దేశించిన ప్రగతి లక్ష్యం సాధించారు.

విద్యాసంస్థలు, యవజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను ఆలోచింపజేశాయి.

పరిశుభ్రతపై ఇన్నాళ్లూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు నిరంతరం పర్యవేక్షించడంతో క్షేత్ర స్థాయిలో ఫలితం కనిపించింది.

అందరి సహకారంతో విజయవంతం

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించడంతో అందరూ స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై నిత్యం పర్యవేక్షిస్తాం. ఆరోగ్య పల్లెలుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. అరుణశ్రీ, అదనపు కలెక్టర్

# సృజనతో సుస్థిర వికాసం

పెద్దపల్లి : ఆధునిక సాంకేతికత ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చింది.. విజ్ఞానం, వినోదం, విద్య, బ్యాంకింగ్ తదితర రంగాలకు సంబంధించిన సమాచారం క్షణాల్లో అరచేతిలోకి చేరుతోంది.. ఇటీవలి కాలంలో కృత్రిమ మేధతో డిజిటల్ ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతోంది.. సాంకేతికతతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతుండగా, సైబర్ నేరాల వంటి ప్రతికూల పరిణామాలూ తక్కువేం కాదు.. ప్రపంచవ్యాప్తంగా యువత సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి మార్గం చూపేందుకు ఏటా ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.. ఈ ఏడాది 'సుస్థిర అభివృద్ధికి డిజిటల్ మార్గాలు' అనే అంశం ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను యువత వినియోగించుకొనే తీరుపై ప్రత్యేక కథనం.

**24 ఏళ్ల కిందట అంకురం**

ఐక్యరాజ్యసమితి తొలిసారిగా 1998 ఆగస్టు 8న పోర్చుగల్‌లో అంతర్జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను యువత ముంగిట్లోకి తీసుకురావాలని ఇందులో నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత 2000 నుంచి ఏటా ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నారు. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక అంశాన్ని ఎంచుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈసారి 'సుస్థిర అభివృద్ధికి యువత డిజిటల్ మార్గాలు' (ఫ్రం క్లిక్స్ టు ప్రోగ్రెస్: యూత్ డిజిటల్ పాత్‌వేస్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్) అంశాన్ని తీసుకున్నారు.

**ఆలోచనలను ప్రోత్సహించాలి**

స్థిరమైన భవిష్యత్తు నిర్మించుకొనేందుకు యువత డిజిటల్ సాంకేతికతను ఉపయోగించాలి.

ఆలోచనల పెంపు, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ విధానాన్ని ప్రోత్సహిస్తే లక్ష్యం చేకూరుతుంది.

ప్రభుత్వాలు సాంకేతికతను అందించడమే కాకుండా అవాంతరాలను పరిష్కరించే బాధ్యత తీసుకోవాలి.

సమ్మిళిత వాతావరణంలో యువత డిజిటల్ సాధనాలు వినియోగించుకునేలా చూడాలి.

అందుబాటులోకి ఉపాధి అవకాశాలు

డిజిటల్ ప్రపంచంలో కొత్త శకానికి నాంది పడింది.

ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య వెంటాడుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ వ్యాపారాలతో ఉపాధి అవకాశాలు పెరిగాయి.

యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్నారు.

వ్యసనాలతో భవిత అంధకారం

డిజిటలీకరణతో మంచి ఎంత ఉంటుందో, చెడు ప్రభావం కూడా అంతే ఉంటుంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూదం తదితర వ్యసనాలకు బానిసైతే యువత భవిత అంధకారమవుతుంది. సైబర్ వలలో చిక్కితే సమస్యలు ఎదుర్కోక తప్పదు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల అతి వినియోగం అనారోగ్యకరం.

**నైపుణ్య శిక్షణే కీలకం**

కృత్రిమ మేధ(అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) రాకతో వివిధ రంగాల్లో మనుషుల ప్రమేయం రోజురోజుకూ తగ్గుతోంది.

ప్రపంచవ్యాప్తంగా అయిదుగురు సాంకేతిక నిపుణుల్లో ముగ్గురు మన దేశానికి చెందిన వారే.

యువతకు మన దేశంలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలి. అంకుర పరిశ్రమలను ప్రోత్సహించాలి.

ఆర్థిక వనరులు లేకనే చాలా మంది విదేశాల బాట పడుతున్నారు. ప్రతిభ ఉన్న వారికి ఆ రకమైన ప్రోత్సాహం కల్పిస్తే మన దేశంలోనే బహుళ జాతి కంపెనీలు ఏర్పాటు చేస్తారు.

నైపుణ్యాల పెంపుపై యువతకు శిక్షణ ఇవ్వాలి. లక్ష్యం లేకనే తడబాటు నిర్దిష్టమైన లక్ష్యం లేకనే యువత వెనుకబడుతున్నారు. ఎంచుకున్న రంగం ఏదైనా దానిపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. కష్టాలు జీవిత పాఠాలు నేర్పిస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం, ధైర్యం కోల్పోవద్దు. పొరపాట్లను సరి చేసుకొని ముందుకెళ్తే విజయం తథ్యం. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. దాన్ని బయటకు తీస్తే ఉత్తమ భవిత సొంతమవుతుంది.

సంకీర్తన, బీటెక్ ద్వితీయ సంవత్సరం, పెద్దపల్లి

అప్రమత్తత అవసరం

డిజిటలీకరణతో వేగవంతమైన, సులభతర సేవలు అందుబాటులోకి వచ్చాయి. కృత్రిమ మేధ, మొబైల్ యాప్స్, రీడింగ్‌లపై పట్టు పెంచుకోవడం ద్వారా యువత సంపూర్ణంగా వినియోగించుకోవాలి. పాస్ వర్డులు, యూపీఐ లింకులు అపరిచితుల చేతుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలి. విద్యార్థులు ప్రతిసారీ ఇంటర్నెట్‌లో సమాచారం వెతుక్కోకుండా పుస్తకాలతో విజ్ఞానం పొందేలా చూసుకోవాలి.

దిడ్డి సతీశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు(టీశాట్ బోధకుడు)

# అభివృద్ధి కరవు.. ఇబ్బందులు తీరవు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిసరాల్లో గృహాల క్రయ విక్రయాలపై కొనసాగుతున్న నిషేధం తమకు శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆయా అంశాలపై సమీక్ష చేపట్టి తమ ఇళ్లను నిషేధిత జాబితా నుంచి పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు. 2018లో నాటి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులను ప్రతిపాదించగా రూ.46 కోట్ల నిధులు విడుదల చేసింది. ప్రధాన ఆలయంతో పాటు క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు స్థలం అవసరం కావడంతో సేకరణకు కార్యాచరణ ప్రారంభించారు. దీనికోసం అప్పటి ఈవో మొత్తం 50 ఇళ్లు, ఇతర ప్రైవేట్ వ్యక్తుల స్థలాలను దేవస్థానం అభివృద్ధికి సేకరిస్తున్నామని... వీటి క్రయవిక్రయాలపై నిషేధం విధించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో నిషేధం అమలు చేశారు. 55 గృహాల్లో 14 ఇళ్లపై మాత్రమే నిషేధం విధించాల్సి ఉండగా.. అవసరం లేకున్నా మిగతా 41 గృహాలపై ఏళ్ల తరబడి నిబంధనలు అమలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నూతనంగా ఆలయ అభివృద్ధి పనులేవీ ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఆయా యజమానులు అవసరాల నిమిత్తం ఇళ్లను విక్రయిద్దామన్నా.. నూతనంగా నిర్మించాలనుకున్నా వీలు కాని దుస్థితి నెలకొంది. అప్పటి అధికారుల సమన్వయ లోపం, అనాలోచిత నిర్ణయాల వద్ద ఏళ్ల తరబడి ఈ స్థలాల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దేవస్థానానికి దూరంగా ఉన్న వాటిపై ఎందుకు నిషేధం విధించారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**జంబిగద్దె సమీపంలో..**పదిహేనేళ్లక్రితం శీలం గంగారాం అనే దాత నాలుగు గుంటల స్థలాన్ని దేవస్థానానికి దానం చేయగా ఆ స్థలంలో జంబిగద్దెను నిర్మించారు. కాగా దీనికి ఆనుకొని ఉన్న తొమ్మిది ఎకరాల భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలోకి చేర్చారు. కాగా తమ భూములను జాబితా నుంచి తొలగించాలని గత నాలుగేళ్ల నుంచి పలువురు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. **ప్రతిపాదిస్తే చర్యలు**గతంలో దేవస్థానం అభివృద్ధి పనుల కోసం భూసేకరణ చట్టం కింద అధికారులు చర్యలు చేపట్టారు. దేవస్థానం వారు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తే తాము కూడా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాం.

# రెండేళ్లకే పగుళ్లు

హైదరాబాద్: ఎల్బీనగర్ కేంద్రంగా జీహెచ్ఎంసీ రూ.500కోట్లతో పలు పైవంతెనలు నిర్మించింది. పలు నిర్మాణ పనులు నాసిరకంగా కనిపిస్తున్నాయి. కట్టిన రెండేళ్లకే బైరామల్‌గూడ కూడలిలోని ఎల్‌హెచ్ఎస్ (ఎడమ వైపు) పైవంతెనపై పగుళ్లు వచ్చాయి. మొదటి లైను పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనాలు కుదుపునకు గురవుతున్నాయి. సరిగ్గా కూడలి మీదే.. మందమల్లమ్మ ప్రధాన రహదారి నుంచి ఎల్బీనగర్ వెళ్లే వాహనాలు బైరామల్‌గూడ ఎల్‌హెచ్ఎస్ పైవంతెనను ఎక్కుతాయి. సరిగ్గా కూడలి వద్దే పైవంతెనపై పది మీటర్ల పొడవున పగుళ్లు వచ్చాయి. 40ఏళ్లపాటు మన్నిక ఇవ్వాల్సిన కాంక్రీటు దిమ్మెలు.. నిర్మించిన రెండేళ్లకే ఛిద్రమవడంపై విమర్శలొస్తున్నాయి. పిల్లర్ల పైన బేరింగులపై ఏర్పాటు చేసిన కాంక్రీటు బ్లాకులు ధ్వంసమవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రాజెక్ట్ మానిటరింగ్



కమిటీ(పీఎంసీ), బల్దియా ఇంజినీర్లు, గుత్తేదారు సంస్థ, నాణ్యతను పర్యవేక్షించే ఇంజినీర్లంతా దృష్టిపెట్టకవపోడం వల్ల సమస్య ఉత్పన్నమై ఉండొచ్చని సీనియర్ ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. భారీ ప్రాజెక్టుల విషయంలో పీఎంసీ, సైట్ ఇంజినీర్లు అత్యంత జాగ్రత్తగా పని చేయాలని, నాణ్యత లోపాలు ప్రజల ప్రాణాలు తీస్తుందని హెచ్చరిస్తున్నారు.

నాటి ప్రమాదమే నిదర్శనం..

నగరవ్యాప్తంగా రూ.35వేల కోట్ల అంచనా వ్యయంతో జీహెచ్ఎంసీ ఎస్సార్డీపీ (వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం) ప్రాజెక్టును చేపట్టింది. అందులో భాగంగా పలు పైవంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించారు. బైరామల్‌గూడ కూడలిలోని మూడు పైవంతెనలు, రెండు లూప్‌ల నిర్మాణం అందులో భాగమే. గతేడాది జూన్ 21న ఎల్‌హెచ్ఎస్ లూప్ నిర్మాణంలో అపశృతి చోటు చేసుకుంది. ఇంజినీర్ల పర్యవేక్షణ లోపం వల్ల నిర్మాణంలోని స్లాబు కుప్పకూలింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

గుత్తేదారును వివరణ కోరుతాం

– దేవానంద్, ముఖ్య ఇంజినీరు

పైవంతెనపై పగుళ్ల విషయమై పీఎంసీ, గుత్తేదారు సంస్థను వివరణ కోరుతాం. వెంటనే ఇంజినీరింగ్ అధికారుల బృందంతోపాటు నేను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తా. కారణాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకుంటాం.

# ఇంకుడు గుంత ఉంటేనే ట్యాంకర్

హైదరాబాద్: ఇంకుడు గుంత ఉన్న ఇళ్లకే ట్యాంకర్లు బుక్ చేసుకొనే అవకాశం ఇవ్వనుంది జలమండిలి. ఎక్కువసార్లు ట్యాంకర్లు బుక్ చేసే వారి వివరాలు సేకరిస్తోంది. ఒకవేళ లేకపోతే ఇంకుడు గుంత నిర్మించుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తారు. అయినా ముందుకు రాకపోతే ఆ ఇళ్లకు ట్యాంకర్లను పంపించరు.

10 శాతం చేరితే చాలు.. ఒక అధ్యయనం ప్రకారం కురిసే వర్షంలో కనీసం 10 శాతం ఇంకితే భూగర్భ జలాలకు ఢోకా ఉండదు. హెచ్ఎండీఏ పరిధిలో ఏటా కురుస్తున్న వాన మొత్తం 15 టీఎంసీలు ఉంటే.. 5 శాతం కూడా భూమిలోకి ఇంకడం లేదు. ఈ ఏడాది



మార్చి, ఏప్రిల్ నెలల్లో నగరంలోని సగం ప్రాంతంలో బోర్లు ఎండిపోవడంతో జలమండలి సరఫరా ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. నెలకు లక్షకుపైగా సరఫరా చేసిన పరిస్థితి ఉంది. అదేసమయంలో ఇంకుడు గుంతలున్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో చాలావరకు బోర్లు పనిచేశాయి. ఈ క్రమంలో నగరంలో ప్రతి ఇంటి ప్రాంగణంలో ఉండేలా జలమండలి నిబంధనలు తేనుంది. ట్యాంకర్ బుక్ చేసేటప్పుడు నల్లా వినియోగదారుల సంఖ్య(క్యాన్ నెంబరు) తప్పనిసరి. దీని ఆధారంగా ఇంకుడు గుంత ఉందా..లేదా...ఆటోమేటిక్‌గా ట్రాక్ చేస్తారు. లేని పక్షంలో ట్యాంకర్ బుక్ అయ్యే అవకాశం లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయనున్నారు. నీటి బిల్లుల బకాయిలు ఉంటే ఇప్పటికే ఈ నిబంధనను జలమండలి అమలు చేస్తోంది. ట్యాంకర్లు బుక్ చేసే అవకాశం లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.

# విద్యార్థులకు శాశ్వత గుర్తింపు సంఖ్య

హైదరాబాద్ : ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి శాశ్వత గుర్తింపు సంఖ్య అందుబాటులోకి రానుంది. జిల్లా విద్యాశాఖను ఒక యూనిట్‌గా తీసుకుని ప్రతి జిల్లాలో అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, అందులో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న వారి వివరాలన్నీ విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'పెన్(పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబరు)' పేరుతో ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన అంకెను కేటాయిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం 'అపార్' పేరుతో విద్యార్థులకు గుర్తింపుకార్డులను అందజేస్తోంది. ప్రతి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానం అమలుచేస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యను లెక్కించేందుకు, ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న పుస్తకాలు, ఏకరూప దుస్తులను కచ్చితంగా లెక్కగట్టేందుకు, మధ్యాహ్న భోజనం సద్వినియోగమయ్యేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

పాఠశాల మారినా అదే నంబరు : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు వివిధ కారణాలు, తల్లిదండ్రుల బదిలీలతో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు, ఒక జిల్లా నుంచి మరో జిల్లాలోని పాఠశాలలో చేరినా.. విద్యార్థికి కేటాయించిన శాశ్వత గుర్తింపు నంబరు మారదు. ఎల్‌కేజీలో చేరేప్పుడు విద్యార్థి ఏ పాఠశాలలో ప్రవేశం తీసుకుంటారో.. ఆ పాఠశాల రిజిష్టర్‌లో నమోదు చేసిన పెన్ నంబరు పదో తరగతి వరకు విద్యార్థి వెంటే ఉంటుంది.

# పరిశ్రమల ఏర్పాటు.. భవితకు తోడ్పాటు



వికారాబాద్ : జిల్లా యువతకు స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే చక్కటి ఉపాధి లభిస్తుంది. కానీ వికారాబాద్ నియోజక వర్గం మొత్తం మీద కనీసం 100 మంది ఉద్యోగులున్న పరిశ్రమ నేటికీ ఒక్కటీ లేదు. వాస్తవానికి ఇక్కడ 1960ల్లోనే పారిశ్రామిక వాడకు అడుగులు పడినా క్షేత్ర స్థాయిలో సరైన సహకారం లభించలేదు. ఈ క్రమంలో నిరుద్యోగ యువకులు ఉపాధి కోసం నగర బాట పడుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఈ జిల్లాకు చెందిన వారే కావడంతోపాటు వ్యవసాయ, వ్యవసాయేతర పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రూపు మార్చి విద్యా సంస్థలకు వినియోగం: వికారాబాద్ ప్రాంత యువకులకు, పేదలకు ఉపాధి కల్పించటంతో పాటు పరిశ్రమలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో శివారెడ్డిపేట సమీపంలో పారిశ్రామిక వాడను మాజీ ముఖ్యమంత్రి, దివంగత చెన్నారెడ్డి ప్రారంభించారు. పరిశ్రమల కోసం ఇక్కడ షెడ్లను కూడా నిర్మించారు. సౌకర్యాలు కల్పించడంలో చొరవ చూపలేదు. దీంతో కొందరు షెడ్ల రూపురేఖలు మార్చి విద్యా సంస్థలకు వినియోగిస్తున్నారు. రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్తు దీపాలు అస్తవ్యస్తంగా మారాయి. నీటి సరఫరా సక్రమంగా కావడంలేదు.

**మహా నగరంలో వివిధ ఉదోగాల్లో..**

వికారాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక జిల్లాకు చెందిన వేల మంది నిరుద్యోగులు, పేదలు హైదరాబాద్ నగరంలో చిరు ఉద్యోగాలు చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌ల్లో, సాఫ్ట్‌వేర్ పరిశ్రమల్లో సెక్యూరిటీ గార్డులుగా, నాలుగో తరగతి సిబ్బందిగా పనులు చేస్తున్నారు.

వికారాబాద్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటు.. 1967

కేటాయించిన ఎకరాలు.. 10

అప్పట్లో నిర్మించిన షెడ్లు..30

ప్రస్తుతం పనిచేస్తున్నవి.. 10 నుంచి 20 లోపు

ఉపాధి పొందుతున్న కార్మికులు.. 200 నుంచి 300

కావాల్సిన వనరులున్నాయి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులున్నాయి. ఆసక్తి ఉన్న వారికి తగిన ప్రోత్సాహాన్ని అందజేస్తాం. ప్రభుత్వం కూడా పరిశ్రమల ఏర్పాటుకు తగిన ప్రాధాన్యం ఇస్తోంది.

మహేశ్వర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్. వికారాబాద్.

**సీఎంకు వినతి పత్రం ఇచ్చాం**

వికారాబాద్ పారిశ్రామిక వాడలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎంకు వినతి పత్రం అందజేశాం. పురపాలక పరిధి మద్గుల్‌చిట్టెంపల్లిలో భూమిని కేటాయించి పరిశ్రమలు స్థాపించాలి.

జి.నర్సింహులు, అధ్యక్షుడు, మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్, వికారాబాద్.

# దందా ఆపట్లే... దారికి రావట్లే



హైదరాబాద్ : బాలాపూర్‌లో ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురైన రౌడీషీటర్‌ను వాహనంతో ఢీకొట్టి తుపాకీతో కాల్చి మరీ చంపారు. స్థానికంగా నెలకొన్న ఆధిపత్య పోరులో రెండు రౌడీముఠాల మధ్య తలెత్తిన వివాదం దీనికి కారణమని భావిస్తున్నారు. ఆసిఫ్‌నగర్ పరిధిలో మద్యం మత్తులో ఇద్దరు మధ్య తలెత్తిన గొడవ ఒకరి హత్యకు దారితీసింది. రహ్మత్‌నగర్‌లో బోనాల వేడుకకు బెదిరించి చందాలు వసూళ్లు చేయడంతో బెదిరింపులు.. మైలార్‌దేవపల్లిలో యూట్యూబర్‌పై కత్తితో దాడి... నిత్యం ఏదోమూలన రౌడీషీటర్ల ఆగడాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. శివారున ఒక రౌడీషీటర్ లైంగిక వేధింపులను భరించలేక స్థానిక యువకులే హతమార్చారు.

పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా. కుటుంబసభ్యుల మధ్య కౌన్సెలింగ్ ఇచ్చినా.. వీరిలో మార్పును తీసుకు రాలేకపోతున్నారు. ఇప్పుడేం జరుగుతోందంటే: గ్రేటర్ మూడు కమిషనరేట్స్ పరిధిలో 7745 మంది పాతనేరస్థులు, రౌడీషీటర్లుగా పోలీసు రికార్డులో నమోదయ్యారు. వీరిలో 30–40 ఏళ్లుగా రౌడీయిజంతో స్థిరాస్తి, హోటల్ రంగాల్లో స్థిరపడిన వారున్నారు. సౌత్, సౌత్‌వెస్ట్ జోన్ల పరిధిలో సుమారు 15 మంది రౌడీషీటర్లు రూ.100 కోట్లకు పైగా విలువైన ఆస్తులు కూడబెట్టినట్టు పోలీసు అధికారులే చెబుతున్నారు. జూదక్లబ్బులు, స్నూకర్ కేంద్రాలు, హుక్కాక్లబ్‌ల్లో భాగస్వామిగా ఉంటున్నారు. నగరం, శివారు ప్రాంతాలతో సహా నల్గొండ, భువనగిరి, ఉమ్మడి మెదక్ జిల్లాల్లో భూవివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్స్ సాగిస్తూ పలుమార్లు అరెస్టయ్యారు.

**డ్రగ్స్ సరఫరా.. తుపాకుల కొనుగోళ్లు**

అడ్డదారిలో డబ్బు సంపాదనకు కొన్ని ముఠాలు మాదకద్రవ్యాల సరఫరా, సెల్‌ఫోన్ల స్నాచింగ్‌కు పాల్పడుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి ఠాణాలో రౌడీషీటర్‌గా నమోదైన మహ్మద్ అర్షద్ చోరీలకు పాల్పడేవాడు. ఇటీవల గంజాయితో పట్టుబడి అరెస్ట య్యాడు. రాజేంద్రనగర్‌కు చెందిన రౌడీషీటర్ ఇర్ఫాన్ అహ్మద్ ప్రత్యర్థిని హతమార్చేందుకు తుపాకీ కొనుగోలు చేశాడు. హత్యకు పథకం వేస్తున్న క్రమంలో నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలు అక్రమంగా తుపాకులు కొనుగోలు చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, బిహార్, చత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాలకు వెళ్లి రూ.20–50వేల లోపు ఖరీదైన పిస్టల్స్, తపంచా, పదుల సంఖ్యలో బుల్లెట్లు కొనుగోలు చేస్తున్నారు.

# అధ్యాపకుల్లేని వృత్తి విద్య



హైదరాబాద్ : ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించేలా కళాశాలల్లోని వృత్తి విద్యా కోర్సులకు సరైన సంఖ్యలో అధ్యాపకులు లేరు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కళాశాలల్లో కొన్నేళ్లుగా అతిథి అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. మూడు జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అనుబంధంగా, సొంతంగా 18 వృత్తి విద్య కళాశాలున్నాయి. ఒక్కో కళాశాలలో ఐదు వందలమందికిపైగా విద్యార్థులున్నారు. గతేడాది అధ్యాపకులను నియమిస్తున్నామంటూ ఇంటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. ఇప్పటికీ ఒకటి, రెండు కళాశాలలు మినహా నియామకాలు చేపట్టలేదు. తరగతులు ప్రారంభమై రెండు నెలలైనా.. అధ్యాపకులు లేకపోవడంతో చదువులు కుంటుపడుతున్నాయి.

**రెండు తరగతులకూ ఒకరే..**

హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వృత్తి విద్య కళాశాలల్లో జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఒకే అధ్యాపకుడు సబ్జెక్టులు బోధిస్తున్నారు. దీంతో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులున్నప్పుడు రెండో సంవత్సరం విద్యార్థులు ఖాళీగా ఉంటున్నారు. కొన్ని కళాశాలలకు ప్రిన్సిపాళ్లు లేకపోవడంతో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లే అదనపు బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపకపోవడంతో అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రతిభ ప్రదర్శిస్తే చాలు.. ఉపాధి అవకాశాలు..**

గతంలో మూడు జిల్లాల్లోని వృత్తివిద్యా కళాశాలల్లో శాశ్వత అధ్యాపకులు, అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తుండేవారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, సెరికల్చర్, మార్కెటింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వైరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, వ్యవసాయం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మా టెక్నాలజీ, ఫిజియోథెరపీ వంటి కోర్సులను వీరు బోధిస్తున్నారు. పాతబస్తీలో ఉంటున్న విద్యార్థులు ఎలక్ట్రిక్ వైరింగ్ కోర్సు పూర్తిచేసిన వెంటనే ఆ ధ్రువపత్రాలతో ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తున్నారు. విద్యార్థినులు మందుల దుకాణాల్లో సహాయకులుగా చేరుతున్నారు. కొన్నేళ్ల నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణరంగం అభివృద్ధి చెందుతుండడం, ఫార్మా కంపెనీలు, ఐటీ సంస్థలు పెరుగుతుండడంతో వృత్తివిద్య కోర్సును పూర్తిచేసుకున్న వారికి సులువుగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో అధ్యాపకులు లేకపోవడంతో ప్రాక్టికల్ క్లాసులను అర్థం చేసుకోవడంతో విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారు.

# అమ్మో.. దుమ్ము

హైదరాబాద్: గోపన్‌పల్లి జర్నలిస్టుకాలనీ, వట్టినాగులపల్లి, గండిపేట, కోకాపేట, ఖానాపూర్, మణికొండ, ఇబ్రహీంబాగ్, పుప్పాలగూడ తదితర గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పలు నిర్మాణ సంస్థలు, ప్రైవేటు వ్యక్తులు నడిపిస్తోన్న అక్రమ క్రషర్లు, రెడీమిక్స్ కేంద్రాలతో స్థానికులు ఊపిరి తీసుకోలేకపోతున్నారు. అనుమతి లేని కేంద్రాలతో ఆ ప్రాంతాలన్నీ దుమ్ముతో నిండుతున్నాయి. కాలుష్యంతో ప్రజలు శ్వాస సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. క్రషర్లలో ఉపయోగించే నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. వందలాది టిప్పర్లు రోజంతా రహదారులపై తిరుగుతుండటంతో ఇటీవల విప్రో సర్కిల్‌లో రోడ్డు ప్రమాదం జరిగి నలుగురు దుర్మరణం చెందారు. ఆయా సమస్యలపై స్థానికులు కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీకి వరుసగా ఫిర్యాదు చేస్తున్నా.. అధికారులు కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

**40 నుంచి 50 కేంద్రాలు..**



కోకాపేట చుట్టుపక్కల గ్రామాల్లో 40–50 క్రషర్లు, రెడీమిక్స్ కేంద్రాలు నడుస్తున్నాయి. వాటికి స్థానిక నేతలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు దన్నుగా ఉన్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉన్న అక్రమ కేంద్రాలపై చర్యలు లేకపోవడంతో.. ఇటీవల మరిన్ని కేంద్రాలు నిర్మిస్తున్నారు.

**విద్యుత్తు శాఖకు లేఖ..**

నిర్మాణ సంస్థలు క్రషర్లు, రెడీ మిక్స్ కేంద్రాలను సొంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు. అధికారికంగా ఏర్పాటు చేసుకుంటే సమస్య ఉండదు. గాల్లోకి ఎగిరే దుమ్మును చిమ్నీలు, జాలీలు, నీటి పిచికారీ యంత్రాలతో అరికట్టాలి. నిర్దేశిత సమయాల్లోనే కేంద్రాలు పనిచేయాలి. ప్రభుత్వమే టిప్పర్లు రోడ్లపై తిరిగేందుకు సమయాన్ని కేటాయిస్తుంది. రోడ్లపై గుంతలు పడకుండా, దుమ్ము ఎగరకుండా చర్యలు తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి ఆయా ప్రమాణాల అమలును తరచూ తనిఖీ చేస్తుంది. ఓఆర్ఆర్ ఇరువైపులా అనేక అక్రమ క్రషర్లు, రెడీమిక్స్ కేంద్రాలు అనుమతి లేకుండా ఏర్పాటవుతున్నాయి. వాటిని పీసీబీ, జీహెచ్ఎంసీ లేదా స్థానిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఆదిలోనే అడ్డుకోవాలి. కానీ అలా జరగట్లేదు. గోపన్‌పల్లి గ్రామస్థులు గతేడాది వరుస ఫిర్యాదులు చేయడంతో పీసీబీ పలు కేంద్రాలకు తాళం వేసింది. నెల రోజులకు అవి మళ్లీ తెరచుకున్నాయి. పీసీబీ సౌత్ సర్కిల్ రంగారెడ్డి జిల్లా ఇంజినీర్లు విద్యుత్తుశాఖకు లేఖ రాశారు. అక్రమ కేంద్రాలకు విద్యుత్తు సరఫరా ఆపేయాలని కోరారు. కొన్నింటికీ విద్యుత్తు సరఫరాను నిలిపేయగా.. యాజమాన్యాలు వేరే పేరుతో సరఫరా తీసుకుంటుండగా, మరికొందరు జనరేటర్లను ఏర్పాటు చేసుకుని కాలుష్య కేంద్రాలను నడిపిస్తుండటం గమనార్హం.

# నైనీ పనులు మరింత వేగం

గోదావరిఖని: సింగరేణికి ఇతర రాష్ట్రంలో కేటాయించిన ఏకైక బొగ్గుబ్లాకు నైనీ పనుల్లో వేగం పెరిగింది. బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు మార్గం సుగమమవుతోంది. సింగరేణికి కేంద్ర ప్రభుత్వం 2014లో ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గుబ్లాకును కేటాయించింది. అప్పటి నుంచి వివిధ దశల్లో పనులు చేపడుతున్న సింగరేణికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభించడంతో త్వరలోనే ఉత్పత్తి చేపట్టేందుకు అవకాశాలు మెరుగుపడుతున్నాయి. నైనీ బొగ్గుబ్లాకు ఎక్కువగా అటవీ ప్రాంతంలో ఉండటంతో అనుమతుల విషయంలో కొంత ఇబ్బందిగా మారింది. అనేక అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న సింగరేణికి తాజాగా అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను లెక్కించేందుకు అనుమతి లభించింది. 643 హెక్టార్ల రిజర్వు ఫారెస్టు భూమిని సింగరేణికి బదలాయిస్తూ అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో పాటు 140 హెక్టార్ల అటవీ భూమిని కూడా సింగరేణికి అప్పగించింది. అందులో తొలగించే చెట్లను లెక్కించి అంతే స్థాయిలో ఇతర ప్రాంతంలో అటవీ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి. దీనిపై సింగరేణి సంస్థ తాజాగా కసరత్తు ప్రారంభించింది. వారం రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ మొదలు కానుంది.

**అభయారణ్యం పరిధిలో...**సింగరేణికి కేటాయించిన నైనీ బొగ్గుబ్లాకు అభయారణ్యం పరిధిలో ఉండటంతో కొన్ని అనుమతులకు ఇబ్బందులు తలెత్తాయి. ఏనుగుల సంరక్షణ కేంద్రంగా గుర్తించిన ప్రాంతంలోనే గని ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. వన్యప్రాణుల సంరక్షణ అంశాల విషయమై కొంతకాలం అనుమతులు నిలిచిపోయాయి. దాదాపుగా ఏడాది కాలం పాటు నైనీ బొగ్గుబ్లాకునకు సంబంధించిన పనులు ముందుకు సాగలేదు. ఇటీవల అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మళ్లీ పనులు చేపట్టారు.

**ఈ ఏడాది ప్రారంభం** లాభదాయక గనిగా గుర్తించిన సింగరేణి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని ప్రణాళికలు చేసుకుంటోంది. ఆర్థిక సంవత్సరంలో నైనీ బొగ్గుబ్లాకు నుంచి బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు ఇప్పటికే వార్షిక లక్ష్యంలో ఈ గనిని పరిగణనలోకి తీసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు లక్ష్యంగా నిర్దేశించుకోగా నైనీ బొగ్గుబ్లాకు నుంచి ఒక మిలియన్ టన్ను బొగ్గు ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు చేసుకుంది. కొన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదురు కావడంతో అనుమతుల ప్రక్రియ కొంత ఆలస్యం కాగా తాజాగా ఒకొక్కటిగా అనుమతులు వస్తుండటంతో ఈ ఏడాది చివరి నాటికి బొగ్గు వెలికితీసే పనులు చేపట్టనున్నారు. అతి తక్కువ లోతులో బొగ్గు నిక్షేపాలున్న నైనీ బొగ్గుబ్లాకు ద్వారా వెలికి తీసే బొగ్గుకు మార్కెట్‌లో ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. నాణ్యతతో పాటు తక్కువ ఖర్చుతో బొగ్గును వెలికి తీసే అవకాశం ఉండటతో సింగరేణికి ఈ గని లాభాదాయకంగా మారనుంది.

# మరమ్మతుల్లేవు.. ఎత్తి పోయలేవు!

బషీరాబాద్ : ఎత్తిపోతల పథకాలను బాగు చేయిస్తే వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఏళ్లుగా అలాంటివేమీ లేకపోవడంతో జిల్లాలో కాగ్నా నదిపై నిర్మించిన నాలుగు ప్రధాన పథకాలు నిరుపయోగంగా మారాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పథకాలను బాగు చేసేందుకు నిధులు మంజూరుచేసి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ వివరాలతో కథనం..

కళ్లముందే కర్ణాటక తరలిపోతున్న నీరు

వర్షాకాలంలో కాగ్నా నుంచి సుమారు 1-2 టీఎంసీల నీరు జిల్లా మీదుగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతోంది. అడ్డుకట్టు వేసుకొని నీటిని సంరక్షించుకుంటే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాంటివేమీ కనిపించడంలేదు. జిల్లాలో కాగ్నాపై మారుమూల ప్రాంతంలో ఉన్న బషీరాబాద్ మండలంలో మూడు ఎత్తిపోతల పథకాలు, ధారూర్ మండలం దోర్నాల వద్ద ఒక ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అప్పట్లో ఏర్పాటు చేసింది. ఆయకట్టు కింద రైతుల



భూములను సాగులోకి తేవాలన్నదే ప్రధాన ఉద్దేశం. నాలుగు ఎత్తిపోతల పథకాల పరిధిలో మొత్తం 801 మంది రైతులకు గాను 1,780 ఎకరాల భూములకు సాగునీరందించేందుకు సుమారు రూ.కోటి వ్యయంతో పథకాలను నెలకొల్పారు. ప్రారంభమైన కొన్నేళ్ల పాటు పొలాలకు నీరెత్తిపోసినా.. రానురాను నిర్వహణ లోపించింది.

చేసేది లేక బోరు వేయించుకున్నా

ఇందర్‌చేడ్ ఎత్తిపోతల ఆయకట్టు కింద నాలుగెకరాల పొలం ఉంది. నీరందినన్ని రోజులు సంవత్సరానికి మూడు పంటలు తీసుకున్నాను. పథకం మూతబడి ఏళ్లు గడుస్తున్నాయి. భూమిని తాకట్టు పెట్టి రూ.లక్షా 20వేలు అప్పు చేసి బోరు మోటారు వేయించుకుని పంటలు సాగు చేసుకుంటున్నాను.

వెంకటయ్య, ఆయకట్టు రైతు, ఇందర్‌చేడ్.

కొత్తది చేపడితే నయం

జీవన్గీ ఎత్తిపోతల పథకం పడావుగా మారి ఏళ్లు గడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పథకానికి మరమ్మతులు చేసేకంటే కొత్త పథకాన్ని నిర్మాణం చేయాలి. చెంతనే కాగ్నా నీరున్నా.. వినియోగించుకోలేకపోతున్నాం. అధికారులు చొరవ తీసుకోవాలి. మాణిక్‌రెడ్డి, రైతు, జీవన్గీ.

# రహదారుల విస్తరణ.. కావాలి కార్యాచరణ



తాండూరు: రహదారులు బాగుంటే రాకపోకలు సులువుగా సాగుతాయి. ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుంది. అందుకోసం రోడ్లను విస్తరించాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. జిల్లాలోని ప్రధాన రహదారులు, జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రోడ్లు మరింత విస్తరించాల్సి ఉంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎంపీ నితిన్ జయరాం గడ్కరీకి ఈసారి కూడా కేంద్రంలో రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. తాజా పరిస్థితి జిల్లాలో నిర్ణీత రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా విస్తరణ జరిగే లా కేంద్ర మంత్రితోపాటు స్థానిక ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

ఇప్పటికే గడ్కరీకి విన్నవించిన సీఎం

దక్షిణ భాగం పరిధిలోకి వచ్చే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో పాటు రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు అనుమతుల మంజూరు, ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయడం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీని దిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 134 కి.మీ.పొడవుతో ఉన్న మన్నెగూడ-వికారాబాద్-తాడూరు, జహీరాబాద్ - బీదర్ జాతీయ రహదారులుగా విస్తరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఇందుకు మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. తాజాగా కేంద్రంలో మళ్లీ ఆయనే రోడ్ల శాఖ మంత్రిగా ఉన్నారు కాబట్టి ఇచ్చిన హామీ మేరకు రహదారుల విస్తరణ జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. మన్నెగూడ- వికారాబాద్- తాండూరు, జహీరాబాద్- బీదర్ రహదారులు జాతీయ విస్తరణ జరిగితే రాకపోకలు సాఫీగా సాగిపోతాయి. రహదారుల పొడవునా ఉన్న గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి.

రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

గతేడాది (2023)లోనే రూ.300 కోట్లతో రెండు వరుసలుగా ఉన్న తాండూరు- మన్నెగూడ రోడ్డును నాలుగు వరుసల జాతీయ రహదారిగా విస్తరించాలి. ఇందుకు రహదారులు, భవనాల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఇవి కార్యాచరణలోకి వస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

జహీరాబాద్‌తో అనుసంధానం

ముంబయి జాతీయ రహదారికి తాండూరు నుంచి జహీరాబాద్ వరకు వెళ్లే 50 కిలో మీటర్ల పొడవుతో ఉన్న రెండు వరుసల రహదారి అనుసంధానంగా ఉంది. ఇదే రహదారి జహీరాబాద్‌లో ముంబయి-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుసంధానమౌతుంది. 2017లో జహీరాబాద్ - బీదర్ వరకు 30 కిలో మీటర్ల పొడవుతో ఉన్న రహదారిని జాతీయ రహదారిగా విస్తరించాలని ప్రతిపాదన వచ్చింది. అప్పట్లో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ రహదారి కాంగ్రెస్ సదస్సులో మంత్రి నితిన్ గడ్కరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జహీరాబాద్-బీదర్ రహదారిని నాలుగు వరుసల రోడ్డుగా మార్చాలని ఆయనే ప్రకటించారు. ఇదే విషయమై అప్పటి రహదారులు, భవనాల శాఖ, ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి అధికారులతో చర్చించారు. 2018లోనే రహదారి విస్తరణ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కానీ కుదరలేదు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర మంత్రులు చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు.

# రూ.కోట్లు వెచ్చించినా.. తీరని రవాణా కష్టాలు

కోనరావుపేట : అధికారుల అలసత్వం... పాలకుల నిర్లక్ష్యం వెరసి రూ.కోట్లు వెచ్చించినా వాహనదారులు, ప్రయాణికులకు రవాణా ఇక్కట్లు తప్పటం లేదు. ప్రధాన తారు రోడ్డు మూడు ముక్కలుగా మారి అయిదేళ్లు అయినా నిర్మాణం పూర్తి కాలేదు. నిధులు చాలక కొంత వరకు రహదారి పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

కోనరావుపేట మండలం మర్తన్‌పేట, నాగారం, పల్లిమక్త, సుద్దాల, మారుపాక మీదుగా నందికమాన్ వరకు సుమారు 13.5 కిలోమీటర్ల మేర రెండు వరుసల తారు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం అయిదేళ్ల క్రితం పంచాయతీరాజ్‌శాఖ నిధులు రూ.7.50 కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారు నందికమాన్ నుంచి పల్లిమక్త వరకు సుమారు 7.8 కిలో మీటర్ల వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి నాలుగేళ్ల క్రితం నిధుల లేమితో పనులు నిలిపివేశారు. రెండేళ్ల క్రితం జడ్పీ అధ్యక్షురాలు అరుణ ప్రత్యేక చొరవతో జిల్లా భూగర్భ జల వనరులు (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.2.9 కోట్లు మంజూరు చేయగా మర్తన్‌పేట నుంచి నాగారం శివారు వరకు మరో నాలుగు కిలో మీటర్ల వరకు ఒకే వరుసలో తారు రోడ్డు నిర్మించి వదిలేశారు. నిధులు చాలక నాగారం-పల్లిమక్త గ్రామాల మధ్య రెండు కిలో మీటర్ల రోడ్డు పూర్తి కాలేదు. దీంతో గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లు వెచ్చించినా వాహనదారులు, స్థానికులకు



కష్టాలు తీరని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండేళ్ల క్రితం ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి రహదారి పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుంది

ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పల్లిమక్త వాసులంతా వ్యవసాయాధారంగా జీవనం సాగిస్తుంటారు. ముఖ్యంగా వివిధ రకాల పండ్లు, దుంపగడ్డలు, కూరగాయలు విక్రయించటానికి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు వెళ్తుంటారు. రహదారి అధ్వానం ఉండటంతో బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు.

ఎనగంటి రమేశ్, వాహనదారుడు, పల్లిమక్త

గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేశారు నాలుగు రోజుల క్రితం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్షాసమావేశం నిర్వహించారు. నాగారం-పల్లిమక్త మధ్య అర్ధాంతరంగా నిలిచిన తారు రోడ్డు పూర్తి చేయాలని గతంలో పనులు చేసిన గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేశారు. గుత్తేదారు త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. మంగళ్లపల్లి, రామన్నపేట, కొలనూర్ శివారులో హైలెవల్ వంతెనల నిర్మాణ పనుల కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. ఆంజనేయులు, పీఆర్ ఏఈ, కోనరావుపేట

# అనుమతులుండవు.. అడ్డు చెప్పేవారుండరు



హైదరాబాద్: కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నిఘా లేకపోవడంతో అనుమతులు లేని పరిశ్రమల నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. మూసివేతకు ఆదేశాలిచ్చినా రాత్రి వేళల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కాటేదాన్, నాచారం ప్రాంతాల్లో రాత్రి వేళల్లో దుర్వాసన వస్తోందంటూ పౌరులు 'జనవాణి - కాలుష్య నివారిణి'కి ఫిర్యాదు చేస్తున్నారు.

26 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు..

3 వేలకుపైగా పరిశ్రమలున్న నగరంలో.. కాటేదాన్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, నాచారం పరిధిలలో వందల సంఖ్యలో అనుమతులు లేని పరిశ్రమలు నడుస్తున్నట్లు అంచనా. కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్(సీఎఫ్‌వో) అనుమతులు లేకుండానే ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమలు యథేచ్ఛగా కొనసాగుతుండటం...హానికర వ్యర్థాలు వదిలే పరిశ్రమలపై నిఘా లేకపోవడంతో జల, వాయు కాలుష్యం నమోదవుతోంది. ఆరు నెలల్లో పీసీబీ కాలుష్యకారకమైన 26 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు ఇచ్చింది. నిబంధనలు పాటించిన మరో 30 పరిశ్రమలకు నోటీసులు పంపి.. మార్గదర్శకాలు జారీచేసి బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని ఆదేశించింది. మూసివేత ఆదేశాలిచ్చినా కొందరు నిర్వాహకులు కొద్ది రోజుల్లోనే వాటిని ప్రారంభిస్తున్నారు. కాటేదాన్‌లో మూసివేసిన, సీల్ వేసిన పరిశ్రమల నుంచి వ్యర్థాల రాక ఆగడంలేదు. విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తే జనరేటర్‌తో నడుపుతున్నారు. శివారు ప్రాంతాల్లో స్టోన్ క్రషర్లకు కరెంట్ సరఫరా నిలిపివేసినా.. జనరేటర్లు పెట్టి నడిపిస్తుండడంతో విపరీతమైన దుమ్ము, ధూళి రోడ్లపైకి చేరుతోంది. నాచారం పరిధిలో 700 పరిశ్రమలు నమోదు కాగా...ఈటీపీ (ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)కు వ్యర్థాలు తరలించేవి 45కు మించి లేవు.

పరిశ్రమలపై చర్యలివీ...

జీవో 111కు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం గగన్‌పహాడ్ పరిధిలోని యశ్ పిగ్మెంట్స్ ఎల్ఎల్‌పీ పరిశ్రమ నిర్వహించడంతో పీసీబీ కొరడా ఝుళిపించింది. జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల పరిధిలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండొద్దని నిబంధనలు ఉన్నా.. 'సీసం కడ్డీల' తయారీ జరుగుతోందని పీసీబీ గుర్తించి నోటీసులు జారీ చేసింది. విచారణ జరిపి మూసివేతకు ఆదేశాలిచ్చింది. కామన్‌రెండరింగ్ ప్లాంట్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్ఎస్‌జీడీసీఎఫ్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకుంది. చెంగిచెర్లలోని ఈ ప్లాంట్ నిర్వహణకు పీసీబీ 2022 డిసెంబర్ 31న కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్‌కు అనుమతులివ్వగా 2027 నవంబర్ వరకు గడువు ఉంది. రెండరింగ్‌ప్లాంట్ నిర్వహణ (వధశాలల నుంచి తీసుకొచ్చే జంతువ్యర్థాల నుంచి కొవ్వును, ప్రోటీన్లను వేరే చేసే) ప్రక్రియలో వెలువడే వ్యర్థాల నిర్వహణలో మార్గదర్శకాలు పాటించడం లేదని పీసీబీ గుర్తించింది.

# దేవుడి మాన్యం.. దళారుల భోజ్యం

హైదరాబాద్ : అమీర్‌పేట్, సికింద్రాబాద్‌లోని రెండు దేవాలయాలు నిత్యం భక్తులతో కిటకిటలాటుతుంటాయి. అక్కడి దుకాణాలు రద్దీగానే ఉంటాయి. వాటిని లీజుకు తీసుకున్న వ్యక్తులు తక్కువ అద్దె చెల్లిస్తూ వాటిని వేరే వ్యక్తులకు ఎక్కువ అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకొంటున్నారు. స్వయంగా కొందరు అధికారులు ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. ౹ అత్తాపూర్‌లోని సీతారామాలయానికి రూ.కోట్ల విలువ చేసే భూములున్నాయి. అయినా ధూప, దీప, నైవేద్యాలకు వచ్చే ఆదాయం మాత్రం అంతంతే. ట్రస్టీ ఆధీనంలో ఈ దేవాలయం ఉన్న సమయంలో రెండెకరాలు లీజు తీసుకున్న కొందరు తక్కువ అద్దె చెల్లిస్తూ వచ్చారు. దేవాదాయశాఖ అధీనంలోకి రాగానే ఆ భూమిని తమ పరం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆ వివాదం కోర్టు వరకు వెళ్లింది. అక్కడ సానుకూల తీర్పు రాగానే ప్రస్తుతం ఆ రెండెకరాల స్థలానికి కేవలం రూ.25వేలు చెల్లిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో అర్చకుల జీతాలు, వాచ్‌మెన్, ధూపదీప నైవేద్యాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆలయానికి చెందిన మరో 15 ఎకరాల భూములు ఆలయానికి సమీపంలోనే ఉన్నా కొందరు వాటినీ ఆక్రమించేసి పదుల సంఖ్యలో దుకాణాలను నిర్మించేశారు. గతంలో ఎండోమెంట్ ట్రిబ్యునల్ నుంచి ఎవిక్షన్ ఆర్డర్లు ఇచ్చి అద్దెలు వసూలు చేయాలని చెప్పినా..వాటిని అమలు చేసేలోపే ప్రత్యర్థులు మళ్లీ కేసులు వేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

మఠాలు, ట్రస్టుల్లోనూ ఇదే పరిస్థితి...దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ధార్మిక సంస్థలు, మఠాలకకు చాలా చోట్ల స్థలాలున్నాయి. కొన్ని చోట్ల వాణిజ్య సముదాయాలు నిర్మించి అద్దెకిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రముఖ మఠం పరిధిలో 50 దుకాణాలున్నాయి. నెలనెలా రూ.లక్షల్లో అద్దెలొస్తాయి. దాని నిర్వాహకుడు ఆ మొత్తాన్ని సొంత ఖాతాల్లోకి మళ్లిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కాచిగూడలోని మరో ట్రస్టు నిర్వాహకులు సైతం ఇలాగే అద్దెలను స్వాహా చేస్తున్నారు. అద్దెల వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు బయటికి వస్తాయని ఆలయ పరిరక్షణసమితి ప్రతినిధులు కోరుతున్నారు.

# వానాకాలం.. విద్యుత్తుతో జాగ్రత్త

హైదరాబాద్: వర్షాకాలంలో తరచూ విద్యుత్తు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. గాలులకు విద్యుత్తు తీగలు తెగిపడుతుంటాయి. ఉపకరణాలు, నివాసాల్లో నాణ్యమైన వైరింగ్ వాడకపోవడం, స్తంభం నుంచి విద్యుత్తు సరఫరా చేసే సర్వీసు వైరు నాణ్యతగా లేకపోవడం, దానికి సపోర్టుగా ఇన్సులేషన్ ఉన్న జీఐ వైరును వాడకపోవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది. నగరంలోని రహదారుల పక్కన ఉన్న చాలా నియంత్రికలకు రక్షణ కంచెలు లేవు. నగరంలో గతేడాది విద్యుత్తు ప్రమాదాల బారినపడి 69 మంది మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. సెల్లార్లలోకి వాన నీరు చేరి విద్యుత్తు తీగలకు తగిలినా, మీటర్ల వరకు చేరినా విద్యుత్తు సిబ్బందికి సమాచారం అందించాలి. బహదూర్‌పురలో ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షానికి చిరువ్యాపారి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అరటి పండ్లు విక్రయించే ఆయన వర్షంతో ఆశ్రయం పొందేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్తు తీగ తగిలి చనిపోయారు. ఫ్యూజుల స్థానంలో బ్రేకర్లు..నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్తు వస్తువుల సామర్థ్యాన్ని అంచనా వేయడంతోపాటు, భవిష్యత్తు అవసరాలు తీర్చేలా పటిష్టమైన, నాణ్యమైన రాగి తీగ ఉన్న వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షపు నీరు చేరకుండా చూసుకోవాలి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆమోదించిన ఉపకరణాలను ఉపయోగించాలి. విద్యుత్తు ప్రమాదాలకు ఎర్తింగ్ లేకపోవడం ప్రధాన కారణం. స్టార్టర్లు, మోటార్లను రక్షణ లేకుండా తాకకూడదు. తడి ప్రదేశంలో ఇనుప కడ్డీని పాతి దాన్ని తీగ ద్వారా నివాసాల్లోని ప్రధాన కేబుల్‌కు, మోటార్లకు అనుసంధానించాలి. మీటరు పక్కన ఐసోలేటర్ బిగించుకోవాలి. షాక్‌సర్క్యూట్ జరిగినా, అగ్నిప్రమాదం చోటుచేసుకున్నా ఐసోలేట్ ఆటోమేటిక్‌గా విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తుంది. ఎర్త్ లీకేజీ సర్క్యూట్ బ్రేకర్(ఈఎల్‌సీబీ) అనేది ఆధునిక పరికరం. మనుషులు, జీవాలకు షాక్ తగిలిన వెంటనే ఈ పరికరం విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తుంది.

# ఎలాగూ వెళ్తాం.. ఇలాగే వదిలేస్తాం..!



హైదరాబాద్: రాజధానిలోని కొందరు పోలీసుల ప్రవర్తన విచిత్రంగా ఉంటోంది. బాధితులకు తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఫిర్యాదు వస్తే స్పందించి.. సత్వర న్యాయం చేసేందుకు ప్రయత్నించాల్సిన కొందరు ఎలాగో బదిలీపై వెళ్తున్నామనే ఉద్దేశంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇంకొందరు ఠాణాల్లో ఎస్సై, కానిస్టేబుళ్ల ఆగడాలను పట్టించుకోవడం లేదు. కేసుల దర్యాప్తును ముందుకు సాగనివ్వడం లేదు. తాజాగా ఉప్పల్, నాగోల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలపై బదిలీల వేటు నగరంలో చర్చనీయాంశంగా మారాయి. బాధితుల ఫిర్యాదు తీసుకోవడంలో అలసత్వం వహించడంతో వీరిని మారుస్తూ రాచకొండ కమిషనర్ ఆదేశాలిచ్చారు.

ఎన్నికల ముందు నుంచి అంతే..!.. ముఖ్యంగా బదిలీల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. శాసనసభ ఎన్నికలకు ముందు మూడు కమిషనరేట్లలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైల బదిలీలు భారీగా జరిగాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక మళ్లీ బదిలీలు జరిగాయి. ఇది జరిగిన రెండు నెలలకు ఎన్నికల సంఘం రెవెన్యూ జిల్లాకు బదులు లోక్‌సభ నియోజకవర్గం యూనిట్‌గా పరిగణించి.. బదిలీ చేయాలని ఈసీ సూచించింది. దీంతో మళ్లీ బదిలీలు చేయడంతో కొందర్ని అప్పటికప్పుడు సర్దుబాటు చేశారు. వీరు బాధ్యతలు చేపట్టాక ఎన్నికల నిర్వహణ విధులు, బందోబస్తు కల్పించడంతో ఫిర్యాదులు తీసుకోవడంలో అలసత్వం వహించారని విమర్శలొచ్చాయి.

తగ్గుతున్న నిఘా..!.. కొందరు పోలీసుల నిర్లక్ష్యం నేరాలు పెరగడానికి కారణమవుతోంది. పాత నేరస్థులు.. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలపై నిఘా లేకపోవడంతో అడ్డగోలుగా చెలరేగిపోతున్నారు. నగరంవైపు చూడాలంటే భయపడే థార్ గ్యాంగ్ శివార్లలో దోపిడీలు చేసింది. కొందరు ఇన్‌స్పెక్టర్లు ఫిర్యాదులు తమ దగ్గరే అట్టిపెట్టుకుని రాజీకుదురుస్తున్న ఉదంతాలు కమిషనర్లకు చేరుతున్నాయి.

ఫిర్యాదు చేస్తే స్పందన కరవు..

సైబరాబాద్‌లోని జీడిమెట్ల ఠాణా పరిధిలోని ఆగ్రోస్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగి కీలక దస్త్రాలు బూడిదకాగా.. ఫిర్యాదు చేసిన మూడ్రోజుల తరువాత సిబ్బంది తీరికగా ఘటనాస్థలికి వెళ్లారు. నాగోల్ ఠాణా పరిధిలో ఉండే గౌతమ్‌పై చోరీ కేసులున్నాయి. అతడిపై ఇటీవల దాడి జరిగింది. ఇదే సమయంలో ఎస్సై ఫోన్ చేసి ఒక చోరీ కేసులో విచారణకు రావాలని కాల్ చేశారు. ఠాణాకు వెళ్లిన గౌతమ్ తనపై దాడి విషయాన్ని చెప్పి కేసు నమోదు చేయాలన్నాడు. చోరీ కేసు ఉందనే ఇలా చేస్తున్నాడని అతడి ఫిర్యాదు తీసుకోలేదు. దాన్ని మార్చి ఇవ్వాలన్నారు. బాధితుడు ఉన్నతాధికారులకు చెప్పడంతో నాగోల్ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు పడింది.

# మానసిక వైద్యం.. వ్యసనాల నిర్మూలన

గోదావరిఖని : సామాజిక ఒత్తిళ్లు.. జన్యుపరమైన సమస్యలు.. పరిసరాల ప్రభావం.. చెడుఅలవాట్లు విపరీత పరిణామాలకు దారి తీస్తాయి. మానసిక వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. యువతలో చాలా మంది మత్తు పదార్థాలకు బానిసలై క్రమక్రమంగా మానసిక వ్యాధుల బారిన పడుతూ కుటుంబీకులను ఆందోళనకు గురి చేస్తున్నారు. కొందరు వివిధ రకాల ఒత్తిళ్లతో దుర్వ్యసనాలకు బానిసలై మానసిక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా కుంగుబాటు లక్షణాలు కలిగిన వారే అధికంగా ఉంటున్నారు. గోదావరిఖనిలోని ప్రాంతీయ ఆసుపత్రి సార్వజనిక ఆసుపత్రిగా స్థాయి పెరగడం, వైద్య కళాశాల ఏర్పాటుతో దాదాపు అన్నిరకాల సేవలు అందుబాటులోకి రావడంతో మానసిక వ్యాధుల చికిత్స విభాగాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్య సేవలందిస్తుండగా పది పడకల సామర్థ్యంతో ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశారు. మానసిక వ్యాధులు, వ్యసనాల నిర్మూలనకు అవసరమైన అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. గతంలో ఈ వైద్యం కోసం కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండగా ఇప్పుడు గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలోనే సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి నెల సుమారుగా 150 నుంచి 170 మంది వరకు ఓపీకి వస్తుండగా సుమారుగా 10 మంది వరకు వార్డుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. మానసిక వైద్యుల వద్దకు వెళ్తే ప్రజలు తమను అదోరకంగా చూస్తారనే భావనతో కొందరు చికిత్సకు దూరంగా ఉంటున్నారు. అపోహలు వీడి అన్ని రకాల వ్యాధులకు చికిత్స పొందుతున్నట్లుగానే దీనికి సైతం చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

అందుబాటులో అన్నిరకాల మందులు

మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే సంపూర్ణ శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుంది. శారీరక ఆరోగ్య పరిరక్షణపై చూపిస్తున్న శ్రద్ధను మానసిక ఆరోగ్యం కాపాడుకోవడంపై చూపాలి. గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడంతో పాటు అత్యంత విలువైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మత్తు పదార్థాలకు బానిసలై మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు ఎక్కువగా వస్తున్నారు. యువతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలి.

పలు లక్షణాలకు...సాధారణంగా మానసిక వ్యాధుల్లో కుంగుబాటు లక్షణాలు కలిగినవారే అధికంగా ఉంటారు. వీరిని ప్రారంభ దశలో గుర్తించి అవసరమైన చికిత్స అందిస్తే సత్వరమే కోలుకునే అవకాశముంది. మందులతో పాటు కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సహకారంతో మానసిక వ్యాధులనుంచి వారిని దూరం చేయడం సులభతరమవుతుందని వైద్యులు చెబుతున్నారు. కుంగుబాటు, స్కిజోఫ్రీనియా, ఓసీడీ(అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్) లక్షణాలు కలిగిన వారు ఉంటే వెంటనే ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిస్తే సత్వరమే కోలుకునే అవకాశం ఉంటుంది. కుంగుబాటు లక్షణాలు ఉన్న వారు ఎవరితో కలవకపోవడం, ఒంటరిగా ఉండటం, ఎవరితో మాట్లాడకపోవడం ప్రధాన లక్షణాలుగా ఉంటాయి. జీవితంపై ఆసక్తి లేకపోవడం, తొందరగా అలసిపోవడం, పనిపై ఆసక్తిలేకపోవడం, నిద్రలేమి, తరచూ ఆత్మహత్యకు ప్రయత్నించడం తదితర లక్షణాలు ఉంటాయి. రెండు వారాలకంటే మించి ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్సతో పాటు కౌన్సిలింగ్ ఇప్పించాలి. స్కిజోఫ్రీనియా లక్షణాలు కలిగిన వారు తమలో తాము నవ్వుకోవడం, మాట్లాడుకోవటం, ఎవరూ లేకపోయినా తమ ముందు ఎవరో ఉన్నట్లు ఊహించుకొని మాట్లాడటం చేస్తుంటారు. దినచర్యను విస్మరిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించరు. ఈ తరహా చికిత్సలకు ప్రత్యేక విభాగాన్ని గోదావరిఖని ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. డాక్టర్ రవివర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ (మానసిక వైద్యం), గోదావరిఖని



# స్వాతంత్ర్య వేడుకలకు ఎర్రకోట ముస్తాబు.. 6 వేల మంది ప్రత్యేక అతిథులు

దిల్లీ: 78వ స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు దిల్లీలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు దాదాపు 6 వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం అందింది. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండా ఆవిష్కరించిన తర్వాత జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. వివిధ రంగాల్లో రాణించిన, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందాలకు కూడా ఆహ్వానం పంపింది. ఎర్రకోట వేదికగా గురువారం జరగనున్న 78వ స్వాతంత్ర్య వేడుకలకు దాదాపు 400 మంది పంచాయతీరాజ్ సంస్థల మహిళా ప్రతినిధులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు సంబంధిత మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సుమారు 45 మంది 'లఖ్‌పతీ దీదీలు', 30 మంది 'డ్రోన్ దీదీల'ను కూడా ఆహ్వానించినట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు.

# 'హర్ ఘర్ తిరంగా'.. దేశభక్తిని నింపే కార్యక్రమం: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: ప్రజలందరికీ ఏపీ సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మహోజ్వల చరిత గల మన దేశ సమగ్రతను కాపాడటం అందరి కర్తవ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వరుసగా మూడో సంవత్సరం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు.

'ఇంటింటా జాతీయ జెండా' అనే ఈ కార్యక్రమం విస్తృత కార్యక్రమంగా మారడం ఆనందకర విషయమని తెలిపారు. తెలుగు వారైన పింగళి వెంకయ్య రూపొందించిన మువ్వన్నెల జెండా ప్రతి ఇంటిపై రెపరెపలాడటం మనకు మరింత ప్రత్యేకం, గర్వకారణమని కొనియాడారు. ప్రతి ఇల్లు, కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జాతీయ జెండాను సోషల్ మీడియా పేజీల్లో ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకోవాలన్నారు. ఇవన్నీ మనలో జాతీయ భావాన్ని కల్పిస్తాయని, స్ఫూర్తిని నింపుతాయని చంద్రబాబు పేర్కొన్నారు.

# తెదేపా శ్రేణుల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దు: మంత్రి నారా లోకేశ్



పత్తికొండ: కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హొసూరులో తెదేపా నేత, మాజీ మాజీ సర్పంచి వాకిటి శ్రీనివాసులును వైకాపా మూకలు దారుణంగా హత్య చేశాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఎన్నికల్లో తెదేపా తరఫున కీలకంగా పనిచేశాడనే కక్షతో శ్రీనివాసులు కళ్లలో కారం కొట్టి కిరాతకంగా హతమార్చారని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో తిరస్కరణకు గురైనా జగన్ అండ్ కో తమ పాత పంథాను మార్చుకోకుండా ఇటువంటి దురాగతాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం శ్రేణుల సహనాన్ని చేతగానితనంగా భావించకూడదన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై ప్రజా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. వైకాపా మూకల చేతిలో బలైన శ్రీనివాసులు కుటుంబానికి తెదేపా అండగా నిలుస్తుందని నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

**హత్య వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదు: పల్లా శ్రీనివాసరావు –** కర్నూలు జిల్లాలో తెదేపా నేత శ్రీనివాసులు హత్యను పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఖండించారు. హొసూరులో తెదేపాకు భారీ మెజారిటీ రావడంలో శ్రీనివాసులుది కీలకపాత్ర అని పేర్కొన్నారు. హత్య వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పల్లా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు.

# అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములు కొనడం ఎంతవరకు సబబు?: మంత్రి పార్థసారథి



మంగళగిరి: అగ్రిగోల్డ్ భూ వ్యవహారంలోనే మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్ అరెస్టయ్యారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాజకీయ కక్షతో అరెస్టులు చేస్తున్నామని వైకాపా నేతలు అసత్యాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. "సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను చట్టవ్యతిరేకంగా కొని విక్రయించారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను కొనడం ఎంతవరకు సబబు?తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కొనుగోలు చేశారు. అగ్రిగోల్డ్‌లో డిపాజిట్‌లు చేసి పేదలు నష్టపోయారు" అని పార్థసారథి అన్నారు.

# అనాగరికంగా హత్య చేశారు..




విశాఖపట్నం: హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం బెల్లం వినాయకున్ని, సంపత్ వినాయకున్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రిని మీడియా పలుకరించగా.. కర్నూలు టీడీపీ నేత శ్రీను హత్యపై స్పందించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నాలుగు రాజకీయ హత్యలు జరిగాయని, అందులో ముగ్గురు తెలుగుదేశం పార్టీ నేతలు హత్యకు గురయ్యారని, అనాగరికంగా హత్య చేశారని అన్నారు. కర్నూలు ఎస్పీతో ఫోన్లో మాట్లాడానని, నిందితుల్ని పట్టుకుని చట్ట ప్రకారం శిక్షింస్తామని చెప్పారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని హోంమంత్రి అనిత తెలిపారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసీపీ నాయకులను చంపేస్తున్నారని జగన్ గగ్గోలు పెడుతున్నారని, ఈరోజు అధికార పార్టీకి చెందిన నాయకుడు హత్యకు గురయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు కావాలనే రాష్ట్రంలో లాండ్ ఆర్డర్ సరిగా లేదని క్రియేట్ చేస్తున్నారని విమర్శించారు. హత్య చేసిన నిందితులను ఎట్టి పరిస్థితిలో వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీల కోసం ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని, పెద్దల సభకు మచ్చ తెచ్చే విధంగా కొంతమంది ఎమ్మెల్సీల ప్రవర్తన ఉందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేశారని, అలాంటి వ్యక్తిని జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించలేదని ఆరోపించారు. ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండవలసిన ప్రజాప్రతినిధులు రోడ్లపైకి వచ్చి రచ్చ చేస్తున్నారని. ఎమ్మెల్సీలుగా పంపించే వ్యక్తుల కోసం ఆ పార్టీ నాయకులు, అధిష్టానం ఆలోచించుకొని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఎంతోమంది త్యాగాలు, పోరాటాలు ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైన ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2047 విజయంతో ముందుకు వెళ్తున్నారని, గతంలో విజన్ 2020 తీసుకువచ్చి సక్సెస్ అయ్యారని హోంమంత్రి అనిత అన్నారు. రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లాలని చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని, విజన్ 2047 రాష్ట్ర దేశ భవిష్యత్తుకు ఒక దిక్సూచిగా మారబోతుందని హోంమంత్రి పేర్కొన్నారు. కాగా పత్తికొండ మండలం హొసూరులో దారుణం చోటు చేసుకుంది. టీడీపీ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు దారుణ హత్యకు గురయ్యాడు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఊరి బయట కళ్లలో కారం పొడి చల్లి వేట కొడవళ్లతో దుండగులు నరికి చంపేశారు. సార్వత్రిక ఎన్నికల్లో హొసూరు గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ తేవడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక పోయారు. ఏపీలో టీడీపీ కూటమి దాదాపు అన్ని చోట్ల భారీ మెజార్టీతో విజయం సాధించింది. ఈ విజయానికి చాలా మంది నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కృషి చేశారు. వైసీపీ ఆగడాల కారణంగా విసిగిపోయిన ప్రజానీకమంతా కూటమికి మద్దతుగా నిలిచింది. ఈ క్రమంలోనే హొసూరు గ్రామంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. ఈ విషయాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికలు జరిగి రెండు నెలలు అవుతున్నా కానీ వారిలోని ఆగ్రహావేశాలు చల్లారడం లేదు. హొసూరులోనూ టీడీపీకి భారీ మెజారిటీ వచ్చింది. దీంతో తమ గ్రామంలో భారీ మెజారిటీ రావడానికి శ్రీనివాసులే కారణమని భావించారు. సమయం చూసి బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఊరి బయట కంట్లో కారం కొట్టి వేట కొడవళ్లతో దారుణాతి దారుణంగా నరికి చంపేశారు.




దిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇప్పట్లో జైలు నుంచి విడుదలయ్యేలా కన్పించట్లేదు. ఈ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో ఆయన మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐకి నోటీసులు జారీ చేసింది. మద్యం విధానానికి సంబంధించి జూన్ చివర్లో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ అరెస్టును సవాల్ చేస్తూ తొలుత దిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఊరట లభించలేదు. అరెస్టు చట్టబద్ధమేనంటూ ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఈ కేసులో సీఎంకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అనంతరం సీబీఐకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 23వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు ఈడీ కేసులో ఇప్పటికే సుప్రీంకోర్టు ఆయనకు జులై 12న మధ్యంతర బెయిల్ మంజూరుచేసిన సంగతి తెలిసిందే. కానీ సీబీఐ కేసులో అరెస్టయినందున ఆయన జైలు నుంచి విడుదల కాలేకపోయారు.




## పీఎస్సార్ ఆంజనేయులు, సంజయ్, సునీల్‌కుమార్ సహా 16మందికి ఏపీ డీజీపీ మెమోలు

అమరావతి: ఏపీలో వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు రోజూ హెడ్ క్వార్టర్లలో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉంటూ అందుబాటులో ఉండని సీనియర్ ఐపీఎస్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు మెమోలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉండి హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో లేనివారికి మెమోలు ఇచ్చారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న డీజీ ర్యాంకు అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, సునీల్ కుమార్ సహా 16 మంది ఐపీఎస్ అధికారులకు మెమో జారీ అయ్యాయి. వెయిటింగ్ లో సీఐడీ మాజీ చీఫ్ సంజయ్, విజయవాడ మాజీ సీపీ కాంతి రాణా టాటా, కొల్లి రఘురామిరెడ్డి, అమ్మిరెడ్డి, విజయరావు, విశాల్ గున్ని, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణ కాంత్ పటేల్, పాలరాజులకు డీజీపీ మెమో జారీ చేశారు. ఉ. 10 నుంచి సాయంత్రం వరకు డీజీపీ ఆఫీసులోనే ఉండాలని ఆదేశించారు. విధులు ముగిశాక అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలని డీజీపీ స్పష్టం చేశారు.




# ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద కొనసాగుతున్న భార్య నిరసన

టెక్కలి పట్టణం: శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద ఆయన భార్య వాణి చేపట్టిన నిరసన దీక్ష ఆరో రోజుకు చేరింది. తమను ఇంట్లోకి రానివ్వడం లేదంటూ వాణి, పెద్ద కుమార్తె హైందవి బయట ఉన్న కారు షెడ్డులోనే దీక్ష కొనసాగిస్తున్నారు. వైకాపా కార్యకర్త దివ్వల మాధురితో తన భర్త వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని వాణి ఆరోపిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి రెండు కుటుంబాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. దువ్వాడ శ్రీనివాస్, వాణి ఇప్పటికే టెక్కలి పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఒంగోలులో వైకాపాకు బిగ్‌షాక్..

## మేయర్‌తో పాటు 12 మంది కార్పొరేటర్లు రాజీనామా

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఒంగోలులో వైకాపాకు బిగ్ షాక్ తగిలింది. నగర మేయర్ సుజాతతో పాటు 12 మంది కార్పొరేటర్లు



ఆ పార్టీకి రాజీనామా చేశారు. నాయుడుపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో తెదేపాలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

# సీనియర్ ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణకు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్

అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. కేంద్ర డిప్యుటేషన్ నుంచి ఏపీకి తిరిగొచ్చిన ఆయనకు నూతన బాధ్యతలు అప్పగించింది. పోలీస్ ఆర్గనైజేషన్ ఐజీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్‌కు బాధ్యతలు చేపట్టాల్సిందిగా ఆదేశాలిచ్చింది. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు వీలుగా ఏపీలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తోంది. అనంతపురం జేసీగా డి.హరితకు ఇచ్చిన పోస్టింగ్‌ను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆమెను ఆదేశించింది. ఆమెకు పోస్టింగ్ ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.

# ఈనెల 20 వరకు వల్లభనేని వంశీపై చర్యలు తీసుకోవద్దు: హైకోర్టు



అమరావతి: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఈనెల 20 వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది. కృష్ణా జిల్లా గన్నవరంలోని తెదేపా కార్యాలయంపై దాడి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. పలువురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని 71వ నిందితుడిగా చేర్చి గన్నవరం కోర్టుకు రిమాండ్ రిపోర్టు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేస్తారనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత వంశీ నియోజకవర్గానికే రాలేదు. గత నెల 7న విజయవాడలోని నివాసానికి వచ్చిన సమయంలో తెదేపా శ్రేణులు దాడులకు దిగాయి. పోలీసు, కేంద్రబలగాలు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దాయి. అప్పటి నుంచి వంశీ ఎక్కడున్నారనే సమాచారం లేదు.

## ఐఫిల్ అందం ముందు అందాల దక్షా

తేజ దర్శకత్వంలో వచ్చిన హెూరా హెూరి సినిమా తో నటిగా దక్షా నాగర్కర్ ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమా నిరాశ పరిచిన కూడా ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. నటిగా, మోడల్ గా సుదీర్ఘ కాలంగా కెరీర్ ను కొనసాగిస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. సోషల్ మీడియా సెన్సేషన్ అంటూ ఈ అమ్మడికి పేరు ఉంది. అందాల దక్షా నగర్కర్ షేర్ చేసిన ప్రతి ఫోటో షూట్ కూడా అందరి దృష్టిని ఆకర్షించడం తో పాటు వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి ఈమె ఇన్ స్టా లో షేర్ చేసిన అందమైన ఫోటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆకట్టుకునే దక్షా నగర్కర్ తాజాగా ఫ్రాన్స్ లో ఉన్న ఐఫిల్ టవర్ ముందు ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. సాధారణంగా ఈమె అందమైన ఫోటోలు షేర్ చేస్తేనే ఎక్కువ మంది నెటిజన్స్ లైక్ చేస్తూ షేర్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు అందమైన ఐఫిల్ టవర్ ముందు ఈ అందాల



దక్షా నగర్కర్ నిల్చుని ఫోటోలకు ఫోజ్ ఇవ్వడంతో అందరూ వావ్ అంటూ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. విభిన్నమైన ఔట్ ఫిట్ లో ఐఫిట్ టవర్ ముందు ఉన్న దక్షా ఫోటోలకు నెటిజన్స్ నుంచి మంచి స్పందన దక్కింది. జాంబీ రెడ్డి మరియు బంగార్రాజు సినిమాల్లో ముఖ్య పాత్రల్లో నటించిన దక్షా నగర్కర్ గత ఏడాది రవితేజ హీరోగా నటించిన రావణాసురుడు తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కూడా పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోక పోవడంతో పాపం దక్షా నాగర్కర్ కి నిరాశే మిగిలింది. హీరోయిన్ గా ఒకటి రెండు అవకాశాలు వచ్చినా కూడా అవి పెద్దగా ప్రభావం చూపించలేదు. ప్రస్తుతం కెరీర్ లో ఆఫర్ల కోసం ఈ అమ్మడు తెగ ప్రయత్నాలు చేస్తుంది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటుంది. టాలీవుడ్ లో కాకుండా ఈ అమ్మడు ఇతర భాషల సినిమాల్లో కూడా నటించేందుకు ప్రయత్నిస్తే ఫలితం ఉండే అవకాశం ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేస్తున్న ఫోటోల కారణంగా అన్ని చోట్ల మంచి గుర్తింపు దక్కింది. కనుక ఒక మంచి ఆఫర్ వస్తే కచ్చింగా అన్ని చోట్ల కూడా తన ప్రతిభ చూపించే అవకాశం ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్, ఎక్స్‌ప్రెషన్స్ ను బాగా పలికించే రూపం అవ్వడం వల్ల దక్షా కి ముందు ముందు అయినా మంచి అవకాశాలు వస్తాయని కొందరు భావిస్తున్నారు.

## అందాల కపూర్ క్లోజప్ షో

రాక్‌స్టార్ సినిమాకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ సినీ కెరీర్ ను ఆరంభించిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. కొరియోగ్రఫీ నుంచి తక్కువ సమయంలోనే నటన వైపు ఈ అమ్మడు అడుగులు వేసింది. 2014 లో శర్వానంద్ కి జోడీగా మొదటి సారి రన్ రాజా రన్ సినిమాలో హీరోయిన్ గా నటించి మెప్పించింది. మొదటి సినిమాతోనే అలరించిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్ ఆ తర్వాత పలు తెలుగు ఇతర భాషల సినిమాల్లో నటించి మెప్పించింది. మోడల్ గా, నటిగా, కొరియోగ్రాఫర్ గా మల్టీ ట్యాలెంటెడ్ అనిపించుకున్న ముద్దుగుమ్మ సీరత్ కపూర్ ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో పెద్ద ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయినా ఇతర భాషల్లో పర్వాలేదు అన్నట్లుగా ఆఫర్లు దక్కించుకుంటుంది. సినిమాలు పెద్దగా చేయకున్నా కూడా సోషల్



మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు, విభిన్నమైన హెయిర్ స్టైల్ వల్ల ఈ అమ్మడు రెగ్యులర్ గా మీడియా దృష్టిని ఆకర్షించడంతో పాటు సోషల్ మీడియాలో సందడి చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ పిక్ చూపరులను కట్టిపడేస్తుంది. చూపు తిప్పుకోవడం కూడా కష్టం గా ఉంది అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బ్లూ జీన్స్ టాప్ తో క్లీ వేజ్ షో చేస్తూ కళ్లు పెద్దవి చేసేవిధంగా షో చేసిన ఈ అమ్మడికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయి అందాల ఆరబోత చేస్తే ఈ కపూర్ బ్యూటీకి ముందు ముందు అయినా టాలీవుడ్ లో మంచి సినిమాల్లో ఆఫర్లు వస్తాయేమో చూడాలి. ఆకట్టుకునే రూపం ఉన్న సీరత్ కపూర్ ను ఫిల్మ్ మేకర్స్ అశ్రద్ధ చేస్తున్నారనే అభిప్రాయంను కొందరు ఆమె ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## సరిపోదా శనివారం ట్రైలర్: మాస్ కంటెంట్‌తో శివ తాండవం




టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు కొత్త కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నాని, ఇప్పుడు 'సరిపోదా శనివారం' సినిమాతో రాబోతున్నాడు. ఇక ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే విపరీతమైన అంచనాలను రేకెత్తిస్తోంది. 'అంటే సుందరానికి' వంటి క్లాస్ చిత్రానికి దర్శకుడైన వివేక్, ఈసారి మాత్రం మాస్ జానర్‌లోకి అడుగుపెట్టారు. ట్రైలర్ విషయానికొస్తే, మొదటగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది నాని పాత్ర. గత చిత్రాల్లో మునుపెన్నడూ చూడని కొత్త మాస్ అవతారంలో నాని కనిపించడం, ఆయన నటనపై ఆసక్తిని పెంచుతోంది.

ట్రైలర్‌లో సాయి కుమార్ వాయిస్ ఓవర్‌తో నాని పాత్రను ఎలివేట్ చేసిన విధానం, ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించేలా ఉంది. మాస్ యాక్షన్ సన్నివేశాలు, మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ డైలాగ్‌లు నాని ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. కోపం వస్తే ఎదుటి వాడి కష్టాన్ని కూడా తన కష్టంగా ఫీల్ అవ్వడం, కేవలం శనివారం మాత్రమే తన కోపాన్ని చూపించడం అలాగే డైరీ లో పేరు రాసి రౌండప్ చేసి ఆ వ్యక్తి అంతు చూడడం వంటి అంశాలు హైలెట్ అవుతున్నాయి. ప్రియాంక మోహన్‌తో నాని కెమిస్ట్రీ కూడా మరో ఆకర్షణ. ట్రైలర్‌లో ఆమె పాత్రకు సంబంధించిన కొన్ని సున్నితమైన సన్నివేశాలు కూడా చూపించారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ గత చిత్రంలోని క్లాస్ కంటెంట్‌ని పక్కన పెట్టి, పూర్తి మాస్ ఎంటర్టైనర్‌గా 'సరిపోదా శనివారం'ని రూపొందించడం విశేషం. సైకో పోలీస్ పాత్రలో ఎస్.జె. సూర్యతో నాని పోటాపోటీగా నటించడం, వీరిద్దరి మధ్య ఫేస్ టు ఫేస్ సీన్స్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. సూర్య పాత్రకు ఉన్న పవర్, ఆయనతో నాని మధ్య చోటుచేసుకునే సన్నివేశాలు సినిమా మొత్తం రసవత్తరంగా సాగుతాయని సంకేతాలు ఇస్తున్నాయి. సినిమాలోని సంగీతం కూడా పెద్ద ప్లస్ పాయింట్. జేక్స్ బిజోయ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ట్రైలర్‌లోని కొన్ని సన్నివేశాలకు మునుపెన్నడూ లేని ఇంటెన్సిటీని అందించింది. వీటితో పాటు, ట్రైలర్‌లో చూపించిన యాక్షన్ సీక్వెన్సెస్ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా ఉన్నాయి. సినిమా పేరు వెనుక ఉన్న కథనం కూడా ఆసక్తికరమే. ట్రైలర్ చూస్తే, నాని పాత్ర శనివారం రోజుననే తన కోపాన్ని బయటపెడతాడు అనే విషయం క్లియర్‌గా తెలుస్తుంది. ఈ అంశం సినిమాకి కొత్తదనం తీసుకొస్తుంది. సినిమా కథలో సడెన్ ట్విస్టులు, లవ్ ట్రాక్, మరియు డ్రామా సన్నివేశాలు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయని ట్రైలర్ ద్వారా అర్థమవుతుంది. ఈ సినిమా ఆగస్టు 29న విడుదల అవుతుంది, పాన్ ఇండియా స్థాయిలో తమిళ్ హిందీ కన్నడ మలయాళం భాషల్లో కూడా విడుదల కానుంది. నాని అభిమానులే కాదు, ప్రేక్షకులందరూ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తానికి, 'సరిపోదా శనివారం' ట్రైలర్ చూస్తే, సినిమాను చూడాలి అనే ఆసక్తిని కలిగిస్తోంది. మరి బిగ్ స్క్రీన్ పై సినిమా ఎలాంటి రెస్పాన్స్ ను అందుకుంటుందో చూడాలి.

## వినాయక చవితికి ఆ ముగ్గురు.. విన్నర్ ఎవరో?










పండుగలకు సినిమాలకు మంచి కనెక్షన్ ఉన్న విషయం తెలిసిందే. ఒకచోట చేరే కుటుంబ సభ్యులంతా.. పండుగను జరుపుకున్న తర్వాత కొత్త సినిమాలు చూసి ఎంజాయ్ చేయాలనుకుంటారు. విద్యార్థులు కూడా హాలీడేస్ వస్తాయి కనుక మూవీస్ ను కవర్ చేయాలనుకుంటారు. అయితే బాక్సాఫీస్ వద్ద పండుగల్లో సంక్రాంతిదే తొలి స్థానమన్న విషయం తెలిసిందే. హీరోలతోపాటు దర్శక నిర్మాతలు.. అప్పుడే తమ సినిమాలను రిలీజ్ చేయాలనుకుంటారు. ఆ తర్వాత దసరాకు కూడా పెద్ద ఎత్తున సినిమాలు రిలీజ్ అవుతుంటాయి. దీపావళికి ఒక్కరోజే సెలవు ఉంటుందని కనుక.. సందడి నార్మలే. అయితే కొన్నేళ్లుగా వినాయక చవితికి క్రేజీ సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. గత ఏడాది మాత్రం కేవలం అప్డేట్స్ కే పరిమితం కాగా.. ఈసారి మూడు చిత్రాలు రిలీజ్ కు సిద్ధమవుతున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీనే నెలకొన్నట్లు కనిపిస్తోంది. అవేంటంటే? వినాయక చవితి సెప్టెంబర్ 7వ తేదీ కాగా.. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ సినిమాతో 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ వంటి అనేక మంది ప్రమఖులు నటిస్తున్నారు. మూవీపై అన్ని భాషల్లో మంచి హైప్ నెలకొంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ మూవీ థియేట్రికల్ హక్కులను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ దక్కించుకున్నట్లు టాక్ నడుస్తోంది. టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యంగ్ హీరో నారా రోహిత్.. సుందరకాండ మూవీతో సెప్టెంబర్ 6వ తేదీన థియేటర్లలో సందడి చేయనున్నారు. కొత్త దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి డైరెక్ట్ చేస్తున్న సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. వృతి వాఘని హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి రెస్పాన్స్ అందుకుంది. త్వరలోనే సినిమా నుంచి మరో క్రేజీ అప్డేట్ రానుందని తెలుస్తోంది. ఈ రెండు సినిమాలతో పాటు దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ మూవీ కూడా వినాయక చవితి కానుకగా రిలీజ్ కు రెడీ అవుతోంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే సూపర్ బజ్ క్రియేట్ అయింది. సాంగ్స్ కూడా అదిరిపోయే రెస్పాన్స్ అందుకుంటున్నాయి. సెప్టెంబర్ 27న తేదీన రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించినా.. 7వ తేదీనే విడుదల కానున్నట్లు తెలుస్తోంది. మరి ఈ మూడింటిలో గణేష్ చతుర్థి విన్నర్ ఎవరో చూడాలి.

## 'ఈగల్' బ్యూటీ గ్లామర్ డోస్ పెంచిందా..!

ఈ మాయ పేరేమిటో సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కావ్య థాపర్. మొదటి సినిమా తో పెద్దగా గుర్తింపు రాకున్నా కూడా ప్రయత్నాలు ఆపలేదు. తమిళంలో ఈమె సినిమాలు వరుసగా చేస్తూ వచ్చింది. తెలుగు లో మరోసారి కావ్య థాపర్ కి ఏక్ మినీ కథ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం ద్వారా ఇండస్ట్రీ గుర్తింపు దక్కించుకుంది. అయితే ఆ సినిమా ఓటీటీ సినిమా అవ్వడం వల్ల రావాల్సిన ఆఫర్లు ఈ అమ్మడికి రాలేదు అనేది సినీ విశ్లేషకులు మరియు ఆమె సన్నిహితుల మాట. రవితేజ కు జోడీగా ఈగల్ సినిమాలో నటించే అవకాశంను ఈ అమ్మడు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో పెద్ద హీరోతో నటించింది అనుకుంటున్న సమయంలోనే ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కాస్త నిరుత్సాహం కు గురి అయ్యింది. ఆ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఆఫర్లు వస్తాయో లేదో అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్ సినిమాలో రామ్ కు జోడీగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డబుల్ ఇస్మార్ట్ సినిమాపై కావ్య థాపర్ ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తోంది. మిడిల్ క్లాస్ లవ్ చిత్రంతో



హిందీలో అడుగు పెట్టిన ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో విజయం దక్కలేదు. కానీ తమిళంలో మాత్రం ఈ అమ్మడు పిచ్చైక్కారన్ 2 సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుని అక్కడ వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. టాలీవుడ్ మరియు కోలీవుడ్ లో సమాంతరంగా సినిమాలు చేస్తున్న కావ్య థాపర్ కి ముందు ముందు భారీ ఆఫర్లు తలుపు తట్టే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈమె డబుల్ ఇస్మార్ట్ ఫలితం పైనే అంతా ఆధారపడి ఉంటుంది అనే అభిప్రాయం ను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. సినిమాల ఫలితం తో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్ సంఖ్య ను భారీగా పెంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలను చూస్తే కావ్యా థాపర్ ఈ మధ్య కాలంలో గ్లామర్ డోస్ పెంచిందే అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. వైట్ షర్ట్ ధరించి పై బటన్స్ ను తొలగించి, కవ్వించే చూపులతో నెటిజన్స్ చూపు తిప్పుకోనివ్వని అందం కావ్య థాపర్ అందం అనిపిస్తుంది. ఈ స్థాయి లో అందంగా ఉన్న కావ్య థాపర్ కి మరిన్ని సినిమాల్లో ఆఫర్లు రావాలి, స్టార్ హీరోయిన్ పీస్ అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు తెగ కామెంట్స్ చేస్తున్నారు.

## కరీనా కపూర్.. మన కథపై ఫోకస్?

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తిరుగులేని ఇమేజ్ సొంతం చేసుకున్న బ్యూటీ కరీనా కపూర్. ఈ అమ్మడు సైఫ్ అలీఖాన్ ని పెళ్లి చేసుకొని కొంతకాలం సినిమాలకి గ్యాప్ ఇచ్చింది. మళ్ళీ సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేసి లేడీ ఒరియాంటెడ్ కథలతో సత్తా చాటే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే క్రూ అనే మూవీతో కరీనా కపూర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఇప్పుడు మరో ఇంటరెస్టింగ్ కాన్సెప్ట్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంట. హైదరాబాద్ లో జరిగిన ఓ యాధార్ధ సంఘటన ఆధారంగా చేసుకొని మేఘనా గుల్జర్ ఈ కథని సిద్ధం చేసారంట. గతంలో జరిగిన ఓ హత్యాచార ఘటన బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా కాన్సెప్ట్ ఉంటుందని తెలుస్తోంది. కంటెంట్ కరీనా కపూర్ కి నచ్చడంతో వెంటనే ఒకే చెప్పేసిందంట. ఈ ఏడాది ఆఖరులో మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందంట. అయితే ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో చేస్తారా లేదంటే కథ బ్యాక్ డ్రాప్ ఏమైనా మారుస్తారా అనేది



తెలియాల్సి ఉంది. ఈ చిత్రంలో యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానా కూడా కీలక పాత్రలో నటించనున్నాడంట. హైదరాబాద్ లో జరిగిన యాదార్ధ సంఘటన ఆధారంగా చేసుకొని తెరకెక్కించనున్న మూవీ కావడంతో తెలుగులో కూడా రిలీజ్ చేస్తారా లేదా అనేది చూడాలి. మరో వైపు సౌత్ లో కూడా ఈమె ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉందనే మాట వినిపిస్తోంది. ఇప్పటికే కరీనా కపూర్ భర్త, హీరో సైఫ్ అలీఖాన్ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి విలన్ గా అడుగుపెడుతున్నారు. ఈ సినిమాలో అతని పాత్ర చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందనే మాట వినిపిస్తోంది. యష్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కనున్న టాక్సిక్ సినిమా కోసం కూడా కరీనాని సంప్రదించారు. అయితే ఆమె డేట్స్ అడ్జస్ట్ చేయలేక మూవీ వదులుకుంది. దీంతో కరీనా స్థానంలో ఆ క్యారెక్టర్ కోసం నయనతారని కన్ఫర్మ్ చేసినట్లు తెలుస్తోంది. మరి సెకండ్ ఇన్నింగ్ లో లేడీ ఒరియాంటెడ్ కథలతో వరుస సినిమాలు చేస్తోన్న కరీనా కపూర్ ఏ మేరకు సక్సెస్ లు అందుకుంటుంది అనేది చూడాలి.




ఢిల్లీ: ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేస్తూ భారాస నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులు ఆగిపోయినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది. అనంతరం పిటిషన్‌పై విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## నేడు సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న సీఎం.. ముమ్మర ఏర్పాట్లు



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 14: జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. దశాబ్దాల సాగు నీటి కల సాకారం చేసే సీతారామ ప్రాజెక్ట్‌ను రేపు (ఆగస్టు 15) ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారు. ముల్కలపల్లి మండలం పూసుగూడెం వద్ద పైలాన్ ఆవిష్కరించనున్నారు. పంప్ హౌస్ మోటార్లు స్విచ్ ఆన్ చేసి డెలివరి సిస్టర్న్ వద్ద గోదారమ్మకు సీఎం రేవంత్ పూజలు చేయనున్నారు. స్వాతంత్ర్యదినోత్సవం రోజు గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు చేరుకోనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనాలు చేసుకుని వైరాలో జరుగనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్ట్ తన రాజకీయ జీవిత సంకల్పమన్నారు. వైరా రైతు రుణమాఫీ సభ చరిత్రలో నిలుస్తుందని పేర్కొన్నారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయాలనే సీతారామ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశామన్నారు. గత ప్రభుత్వం 8 వేల కోట్లతో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ మోటార్లు పాడవకుండా సద్వినియోగం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆగస్ట్ 15న వైరాలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. రైతాంగం తలరాత మార్చే సభగా వైరా సభ నిలవనుందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. "నా జీవిత కోరిక సీతారామతో తీరింది" అని అన్నారు. కాగా... రెండు రోజుల క్రితం సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈనెల 11న పుసుగూడెం, కమలాపురం పంపుహౌస్?ల వద్ద మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్–2 ట్రయల్ రన్‌ను మంత్రులు ప్రారంభించారు.

**మూడోవిడత రుణమాఫీ...** అలాగే ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులు రుణ విముక్తి కానున్నారు. సీతారమ ప్రాజెక్ట్ ప్రారంభం అనంతరం వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2 లక్షల రుణాలను మాఫీ చేయనున్నారు. మూడో విడతగా లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు రుణమాఫీ నిధులను వైరాలో సీఎం విడుదల చేనున్నారు. దాదాపు 14.45 లక్షల మందికి రుణమాఫీ అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన ఖాతాలను మొత్తంగా 32.50 లక్షలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

ఈ మేరకు బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. జులై 18న తొలి విడుతగా 11,4,412 మంది రైతులకు రూ.6034.97 కోట్ల నిధులను విడుదల చేసింది. తొలివిడతలో లక్ష వరకు రుణాలను ఏకకాలంలో మాఫీ అయ్యాయి. అలాగే జూలై 30 అసెంబ్లీ ప్రాంగణంలో రెండో విడత రుణమాఫీ నిధులను సర్కార్ విడుదల చేసింది. రెండో విడతలో లక్ష నుంచి లక్షన్నర వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ అయ్యాయి. అలాగే మూడో విడతలో లక్షన్నర నుంచి రెండున్నర లక్షల వరకు రుణాలను సర్కార్ మాఫీ చేయనుంది.

## గురుకుల హాస్టల్లో సమస్యల పరిష్కారానికి నిర్ణయం..

సిద్దిపేట, ఆగస్టు 14: రాష్ట్రంలో గురుకుల హాస్టల్లలో సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లాలో హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ప్రతి జిల్లా కలెక్టరు, శాననసభ్యులు, విద్యశాఖ అధికారులు గురుకుల హాస్టళ్లను బాధ్యతగా సందర్శించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక నిధులతో ప్లాంటేషన్ పనులను పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందని.. త్వరలోనే విద్యార్థులకు శుభవార్త చెప్తామని తెలిపారు. విద్యారంగ సమస్యలకు 5,000 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. అసౌకర్యాలతో ఉన్న అన్ని విద్యాసంస్థలకు స్థలాల కేటాయింపు జరిపి పక్కా భవనల నిర్మాణం చేపడతామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 42 రైతు వేదికల ద్వారా



యువ రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా... యువరైతులకు వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం తరపున అవసరమైన రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం యువరైతులకు వ్యవసాయ ఆధారిత పథకాలకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు తాను, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ

హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. కె.కేశవరావు రాజీనామాతో తెలంగాణలో రాజ్యసభ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. రాజ్యసభలోని 12 స్థానాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాలకు చెందిన ఈ ఖాళీలకు సంబంధించి సెప్టెంబరు 3న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామఖ్య ప్రసాద్ తస(భాజపా), మీసా భారతి (ఆర్జేడీ), వివేక్ ఠాకుర్ (భాజపా), దీపేంద్రసింగ్ హుడా (కాంగ్రెస్), ఉదయన్ రాజే భోస్లే (భాజపా),



కె.సి.వేణుగోపాల్ (కాంగ్రెస్), బిప్లబ్ కుమార్ దేబ్ (భాజపా) లోక్‌సభకు ఎన్నికయ్యారు. వారి రాజీనామాలతో రాజ్యసభలో ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే తెలంగాణలో భారాస తరపున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కె.కేశవరావు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో, ఒడిశాలో బీజేడీ ఎంపీ మమతా మొహంత తన పదవికి, పార్టీకి రాజీనామా చేయడంతో ఆ స్థానాలకూ ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

## పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి - కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

హైదరాబాద్: 'పేదరికం లేని గ్రామాలు ఉండాలన్నదే నా కల' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రాజేంద్రనగర్‌లో గల జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో జరిగిన 66వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార ప్రసారశాఖ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు థింక్ ట్యాంక్‌గా పనిచేస్తున్న రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖను శివరాజ్ సింగ్ చౌహాన్ అభినందించారు. ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో మరిన్ని శిక్షణా కార్యక్రమాలను పెంపొందించడానికి, సామర్థ్యాన్ని పెంపొందించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పీజీ డిప్లొమా చేస్తున్న విద్యార్థులు గ్రామ సీమల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో చదువుతున్న పీజీ విద్యార్థులు పీహెచ్‌డీ చేయడం కోసం న్యూఢిల్లీలోని జేఎన్‌యూతో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన అధికారుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గ్రామ్ రోజ్‌గార్ సేవక్ అనే ఆన్‌లైన్ కోర్సును కూడా ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎన్ఐఆర్‌డీపీఆర్ క్యాంపస్‌లో ఉన్న రూరల్ టెక్నాలజీ పార్కును సందర్శించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రౌండ్ మోడల్ హౌజ్ (డబుల్ బెడ్‌రూమ్)ను ఆయన ప్రారంభించారు. 409.5 చదరపు అడుగులలో నిర్మించిన ఇంటికి రూ.4.04 లక్షలు ఖర్చయిందని అధికారులు మంత్రికి వివరించారు. చదరపు అడుగుకు రూ.987 ఖర్చు అవుతుందన్నారు.




## ఒంటరిగా ఉండొద్దు.. మర్యాదగా మాట్లాడండి: వైద్యురాలి హత్యాచార ఘటన వేళ అడ్వైజరీపై విమర్శలు

గువాహటి: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోన్న తరుణంలో అస్సాం ఆసుపత్రి జారీ చేసిన మెమో తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సూచనలు చేయడానికి బదులు క్యాంపస్‌లో భద్రతను పెంచాలంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిల్చార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఈ సూచనల చిట్టాను జారీ చేసింది. "మహిళా వైద్యులు, విద్యార్థినులు, సిబ్బంది నిర్మానుష్య ప్రాంతాలు, వెలుతురు తక్కువగా, జనాలు లేని ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఒంటరిగా ఉండకుండా చూసుకోండి. అత్యంత అవసరమైతే తప్ప రాత్రి సమయాల్లో వసతి గృహాలను విడిచి వెళ్లొద్దు. ఒకవేళ వెళ్లాల్సివస్తే అధికారులకు సమాచారం ఇవ్వండి. తెలియని, అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. విధుల్లో ఉన్నప్పుడు చుట్టుపక్కల పరిస్థితులపై ఓ కన్నేసి ఉంచండి. మర్యాదపూర్వక సంభాషణ సాగించండి. వీటివల్ల అనైతికంగా వ్యవహరించే వ్యక్తుల దృష్టిలోపడకుండా ఉండొచ్చు. ఏదైనా వేధింపుల సమస్య ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి" అని ఆ అడ్వైజరీలో సూచించారు. మహిళా సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే దీనిని జారీ చేసినట్లు తెలిపింది. అయితే దీనిపై విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ అడ్వైజరీలో వాడిన పదజాలం బాధించిందని ఆ కాలేజ్‌లోని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ వెల్లడించింది. తమను గదులకే పరిమితం కావాలని చెప్పే బదులు భద్రతా ఏర్పాట్లు మెరుగుపర్చాలన్నారు. క్యాంపస్‌లో లైటింగ్ పెంచాలని, మరిన్ని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేసింది. వెంటనే ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని, తమ డిమాండ్లను నెరవేర్చాలని లేకపోతే తాము నిరసన చేపడతామని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇదిలాఉంటే.. కోల్‌కతాలో వైద్య విద్యార్థి హత్యాచార ఘటన నేపథ్యంలో వైద్య విద్య నియంత్రణ సంస్థ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలలు, వసతిగృహాల్లో వారి భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశిస్తూ వైద్య కళాశాలలకు అడ్వయిజరీ జారీ చేసింది. సాయంత్రం పూట కారిడార్లలో సిబ్బంది స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా లైట్లు ఉండాలని, అన్ని సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీలు ఏర్పాటుచేసి భద్రతా చర్యలను పర్యవేక్షించాలని సూచించింది. "వైద్య విద్యార్థులకు వ్యతిరేకంగా ఎలాంటి హింసాత్మక ఘటన చోటుచేసుకున్నా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 48 గంటల్లోపు ఎన్ఎంసీకి తప్పనిసరిగా నివేదిక పంపాలి" అని ఎన్ఎంసీ తన అడ్వయిజరీలో పేర్కొంది.

## కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం దారుణం: మంత్రి సీతక్క



హైదరాబాద్: వైద్యులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ గాంధీ ఆస్పత్రిలో వైద్యులు ఆందోళన చేపట్టారు. ఓ రోగిని పరామర్శించేందుకు అక్కడికి వచ్చిన మంత్రి.. నిరసన తెలుపుతున్న వైద్యులకు సంఘీభావం ప్రకటించారు.

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం దారుణమన్నారు. మహిళల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు.

దీనిపై పూర్తిస్థాయిలో కృషి చేస్తామని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పలు ఆసుపత్రుల వద్ద జూడాల ఆందోళన



హైదరాబాద్: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆసుపత్రుల్లో ఓపీ సేవలను జూనియర్ డాక్టర్లు (జూడా) నిలిపివేశారు. కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో పీజీ వైద్యులు విధులు బహిష్కరించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఓపీ సేవలను బహిష్కరించారు. విజయవాడలో సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నుంచి రామవరప్పాడు కూడలి మీదుగా ఈఎస్ఐ ఆసుపత్రి వరకు ఇది కొనసాగింది. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. తమను వృత్తి పరంగా కాపాడే రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కోల్‌కతాలో జరిగిన ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీ ఉద్యమం చేస్తామన్నారు.

## తెలంగాణ హెడ్ కానిస్టేబుల్‌కు.. రాష్ట్రపతి గ్యాలంటరీ పతకం




ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ.. పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1037 మందికి ఈ పతకాలను అందజేయనున్నారు. ఇక, ఈసారి అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పోలీసు పతకం ఒకరిని వరించింది. అది కూడా తెలంగాణకు చెందిన వ్యక్తి కావడం విశేషం. హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు రాష్ట్రపతి గ్యాలంటరీ మెడల్‌ను ప్రకటించారు.

**ఎవరీ చదువు యాదయ్య..** తెలంగాణ పోలీసు శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య 2022లో ఓ చోరీ కేసులో ధైర్యంగా వ్యవహరించారు. గొలుసు దొంగతనాలు, ఆయుధాల డీలింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దుండగులు ఇషాన్ నిరంజన్ నీలంనల్లి, రాహుల్‌ను సాహసోపేతంగా పట్టుకున్నారు. 2022 జులై 25న చోరీకి పాల్పడుతుండగా యాదయ్య వీరిని అడ్డుకున్నారు. దీంతో దుండగులు ఆయనపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఛాతీపై పలుమార్లు పొడిచారు. తీవ్ర రక్తస్రావంలోనూ ఆయన వారిని పట్టుకున్నారు. గాయాల కారణంగా 17 రోజుల పాటు ఆయన ఆసుపత్రి పాలయ్యారు. దుండగులను పట్టుకునే క్రమంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గానూ ఈ ఏడాది అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకాన్ని ప్రకటించారు.

**తెలుగు రాష్ట్రాలకు పతకాలు ఇలా..** ఈ ఏడాది మొత్తం 1037 మందికి ఈ పతకాలు ప్రకటించారు. ఇందులో 213 మందికి పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంటరీ, 94 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 729 మందికి పోలీసు విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను అందజేయనున్నారు. ఈ పురస్కారాల్లో తెలంగాణ నుంచి 21 మందికి, ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మందికి ఈ పతకాలు దక్కాయి. తెలంగాణలో ఒకరికి రాష్ట్రపతి గ్యాలంటరీ పతకం, ఏడుగురికి మెడల్ ఫర్ గ్యాలంటరీ, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 11 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. ఇక, ఆంధ్రా నుంచి నలుగురికి మెడల్ ఫర్ గ్యాలంటరీ, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 19 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు అందజేయనున్నారు.

## తెలంగాణాలో టీడీపీకి పూర్వవైభవం తెస్తాం...

హైదరాబాద్: తెలంగాణా లో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పొలిట్‌బ్యూరో సభ్యుడు నర్సింహ తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతున్నామని తెలిపారు. టీడీపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కట్ట వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు నర్సింహ హాజరై మట్లాడారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి పెద్దసంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీషరెడ్డి, వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు, స్వప్నచౌదరి, సరస్వతి, మోహన్‌రావు, నారాయణ, సాంబశివరావు, గౌతం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com